ప్రబుద్ధాంధ్ర

కలాభివర్ధనీపరిషత్పక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:— శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము సెప్టెంబరు ౧౯౩౪ { సంచిక ౯

పెళ్లాడతగ్గ మొగాడేడీ?

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

తూర్పు తెల్లవారుతోం దనగా జకరయ్యా, యెలిజబెత్తూ రైలు కోసం అనపర్తిస్టేషనుకి బయలుదేరారు. స్టేషను రాయవరానికి బిగిసి నాలుగుమైళ్లుంది; కనక యెండ తగలకుండా వెళ్లాలని వారు కొంచెం దురుసుగానే నడుస్తున్నారు. జకరయ్యా చేతిలో చిన్నమూట తప్ప మరేమీ లేదు. యెలిజబెత్తు కులాసాగా కబుర్లు చెబుతూ పక్కపక్కనే నడుస్తోంది. ధవళేశ్వరంలో మిస్సమ్మ దగ్గిర గుమాస్తాగా వున్న తమ కుమారుడు కృపానందాన్ని గురించి వారిద్దరూ చాలా వుత్సాహంగా మాట్లాడుకుంటున్నారు.

ఆళపువారి తోట సమీపించా టప్పటికి మహేంద్రవాడలో టీచరుగా వున్న సామియేలు రామచంద్రపురం వెడుతూ వారి కెదురుపడ్డాడు. మొదట అతను భక్తితో వారికి సలాములు చెయ్యడమూ, ఆదంపతులు ప్రేమతో అతగాణ్ణి దీవించడమూ, తరవాత కుశలప్రశ్నాదికమూ—ఇదంతా సక్రమంగా జరిగిపోయింది. అప్పుడు సామియేలు కృపానందం సంగతి యెత్తుకున్నాడు. "కృపానందం నాకు ప్రియమైన సోదరుని కంటేనూ యెక్కువ. అతణ్ణి చూస్తే నాకు ఆనందం పొంగిపోతుంది. నిన్న రాత్రే నేను ధవళేశ్వరంనుంచి వచ్చాను. అతను మీకు వెయ్యి సలాములు చెప్పమన్నాడు. మిస్సమ్మగారికి అతనిమీద వుండే ప్రేమ మరెవ్వరి మీదా లేదు. మీరు చాలా పుణ్యం చేసుకున్నారు. మీ కుమారుని కోసం గొప్ప అదృష్టం కనిపెట్టుకుని వుంది"అని అతను చెప్పగా వారికి బ్రహ్మానందం అయింది. "యేసుప్రభువు నిన్ను కాపాడుగాక. ప్రియమైన సామియేలూ! నువ్వు నాకు చల్లని కబురు చెప్పావు. నాకు కృపానందం యెలాంటివాడో నువ్వూ అలాంటివాడవే" అని దానికి యెలిజబెత్తు బదులు చెప్పగా, జకరయ్యా "యిప్పుడు నువ్వు మాపాలిటి దేవదూతవైనావు. ఇవాళ మా కృపానందం పుట్టిన రోజు. ఈపండుగు కోసం మా అబ్బాయి యేటా యింటికి వచ్చేవాడు; కాని యీ సంవత్సరం యీ వుత్సవం తమ బంగాళాలో జరగాలని మిస్సమ్మగారు చాలా పట్టు పట్టారు. అందుకోసం మేమే ధవళేశ్వరం వెడుతున్నాము" అని చెబుతూ సామియేలుని కౌగిలించుకున్నాడు.

తరవాత వుచితమర్యాదలు చేసుకుని వారెవరి దారిని వారు వెళ్లిపోయారు.

ఈసంభాషణవల్ల ఆదంపతుల ముఖపద్మాలు చక్కగా వికసించాయి; కాని ఆలస్యం అయింది. భళ్లున తెల్లవారిపోయింది. అందుకు కంగారు పడుతూ జకరయ్యా వడిగా ముందుకి అడుగు వేశాడు. "బిడ్డమీద అందరికీ చాలా ప్రేమగా వుంది. ఈ సంతోషంవల్ల నాకు చాలా బలం వచ్చింది; కనక నీతో సరిగా నేనూ నడువగలను పద" అంటూ ఆమె అతని అడుగుల్లో అడుగు వేసింది.

సరిహద్దు పుంతలోకి వచ్చాటప్పటికి ఆదంపతు లిద్దరూ వులిక్కి పడి నుంచునిపోయారు. చూడగా రోడ్డు పక్కని యీత రుప్ప చాటున వొక యువతి మూలుగుతూ పడివుంది. కట్టుకున్న మల్లుపంచె చాలా తెల్లగానే వుంది; గాని అక్కడక్కడ రోడ్డు బూడిద మరకలతోటీ, నెత్తురు మరకల తోటీ నానా భీభత్సంగానూ వుంది. దగ్గిరికి వెళ్లి చూడగా వొంటినిండా అరిటికాయల్లాగ కదుములూ, తాండ్రబెత్తల్లాగ బొబ్బలూ వున్నాయి. నెత్తిమీదా, కుడిభుజంమీదా, యెడమ మోకాలిమీదా గాయాలు పడి నెత్తురు అట్టకట్టి వుంది.

ఆస్థితి చూశాటప్పటికి వారిద్దరి హృదయాలూ కరిగిపోయాయి. వెంటనే యెలిజబెత్తు "ప్రభువా! ఈబిడ్డని రక్షించు" అంటూ దగ్గిరికి వెళ్లి కూచుని ఆమె శిరస్సు తన వొళ్లోకి తీసుకుంది. జకరయ్యా "గాయాలు! గాయాలు" అంటూ ఆత్రపడుతూ దగ్గిర కూచున్నాడు. కమిలిపోయిన ఆపచ్చని శరీరం చూడగా వారికి వొళ్ళు జలదరించింది. యెలిజబెత్తు యువతి మొగమ్మీద కమ్మిన జుట్టు సవరిస్తూ "నీళ్ళు తీసుకుర"మ్మనగా, జకరయ్యా మూట విప్పి చెంబు తీసి, బోదినుంచి నీళ్లు తెచ్చి అందించాడు. వెంటనే ఆమె చెంబు నోటికందించబోయింది; గాని యువతి తల వూపి చెయ్యి పట్టుకుని "మీ రెవ?" రని అడిగింది.

"మేము క్రైస్తవులం"

"అయితే నన్నెందుకు ముట్టుకున్నారూ?"

"నీ స్థితి చూడలేక"

"...................."

"నువ్విక్కడ యిలాగ యెందుకు పడి వున్నావూ?"

"కొట్టి యీడ్చి పారేశారు"

"యెవరూ?"

"...................."

"నిన్నెవరూ చూడలేదూ?"

"మహేంద్రవాడ బ్రాహ్మలిద్దరు చూశారు"

"చూసి — నిన్నిక్కడే అట్టేపెట్టే శారేం?"

"అయ్యో..............."

"పలకరించారా?"

"పులిని చూసినట్లు పారిపోయారు"

"ఏం?"

"అది మా జాతి లక్షణం"

"అయితే యిది మా జాతి లక్షణం"

"...................."

"కష్టంలో వున్నవారికి సాయమూ, సేవా చెయ్య వలసిందని యేసుప్రభువు ఆజ్ఞ. ప్రజలకి దేవుని రాజ్యం చూపించి—జనులను నిజమైన మనుష్యులుగా చెయ్యడానికి మిషనువారు మమ్మల్ని రాంబ వరంలో నిలిపారు"

"...................."

"మా సేవ పొందడానికి నీ కిష్టం లేకపోతే మీ వాళ్లెక్కడ వున్నారో చెప్పు తీసుకు వస్తాము"

"యమదూతలనా?"

"మీ వాళ్లు యమదూతలా?"

"అంతకంటే అన్యాయం"

"అంటే?"

"యమదూతలు ఆయుష్షు మూడితే గాని యెవ ర్నీ తీసుకుపోరు. మా వాళ్లు బతికి వుండగానే—"

"అయితే మే మెలాకనపడుతున్నామూ నీకూ?"

"దేవదూతల్లాగ"

దంపతులిద్దరూ చకితులైనారు. ఆమె ధోరణి వారికి బోధపడ లేదు.

"అయితే మేము నీకు సేవ చెయ్యడాని కింక అడ్డెందుకూ?"

"నేను మీ కెవర్నీ?"

"ప్రాణికోటిలో మాకు సాటిదానవు. దేవుని రాజ్యంలో మాతో సమానంగా హక్కులు గల దానవు. ఇప్పుడు నువ్వు కష్టంలో వున్నావు కనక, నీకు సేవ చేస్తే దేవుడు మా పాపాలు మన్నించి మాకు మోక్షం యిస్తాడు. ఇది యేసుప్రభువు మాకు—అందరికీ చేసిన మహోపదేశం"

యువతికి వ్యధితహృదయంమీద అమృతం చిలికినట్లయింది. ఆమె రెండు చేతులూ అప్రయత్నంగా అంజలిముద్ర వహించాయి. కళ్లు మూతలుపడ్డాయి. పెదిమలు రావిరేకల్లాగ కదిలి పోయాయి.

వొక్క నిమిషం అయిన తరవాత యువతి మళ్లీ కళ్లు విప్పి చూసింది.

"ఈశ్వరసంకల్పం యిలా వుంది కాబోసు. దాన్ని అడ్డుపెట్టడానికి నే నెంతటిదాన్ని? నా కింకా బతకా లనే ఆశగా వుంది. దేవు డిచ్చిన ఆయుర్దాయం కష్టమో సుఖమో నలుగురితో పాటు అనుభవించకుండా మధ్యకాలంలో యెందుకు తుంచేసుకోవాలీ? అలా చేస్తే మాత్రం శాంతి లభిస్తుందా? తుంచేసుకోవడం యీశ్వరతిరస్కారం కాదూ? నాకు చావు వస్తే యిదివరకే వచ్చివుండవలసింది. ఇంత పని జరిగాక కూడా నేను బతికి వుండడం చూస్తే నన్నింకా బతికి వుండమనే యీశ్వరు డాజ్ఞాపించినట్టు తోస్తోంది—"

"నీ కీ స్థితి—"

"రాత్రి పన్నెండు గంటలు దాటాక మా నాన్నా, మా అన్నలూ కొట్టి నన్నీతుప్పల్లోకి యీడ్చేశారు. అరగంట కిందటే నాకు చైతన్యమో, మెలకువో వచ్చింది"

"మీ వాళ్లే నిన్నెందుకు కొట్టారు?"

"......నేను పూర్వజన్మంలో యెన్నో పాపాలు చేశాను. లేకపోతే నాకీ జన్మ వచ్చివుండదు......మీరు చూపిస్తూ వున్న వాత్సల్యం చూస్తే నాకు ప్రాణాలు లేచివస్తున్నాయి"

"యేసుప్రభువు నిన్ను రక్షించుగాక"

"నా కిప్పుడు యేసు ప్రభువే గతి అయినాడు ......గొంతుకు యెండిపోతోంది......మాట్లాడ లేను"

"కనీసం మంచినీళ్లు పుచ్చుకో అమ్మా"

"తెల్లవారింది. మొగం కడుక్కోకుండా నే నిప్పుడు మంచినీళ్లు పుచ్చుకోను"

ఈదీక్షకి ఆశ్చర్యపడుతూ యెలిజబెత్తూ, జకరయ్యా ఆమెని భద్రంగా లేవదీసి, నెమ్మదిగా నడిపించుకువెళ్లి రోడ్డు పక్కని కూచోబెట్టారు. వుత్తరక్షణంలో ఆమె దంతధావనం చేసుకుని చెంబెడు నీళ్లు తాగి మళ్లీ పడుకుంది. అది చూసి "వుండు, వుం" డంటూ యెలిజబెత్తు మళ్లీ ఆమె శిరస్సు తన వొడిలోకి తీసుకుంది.

3

యువతి నాలుగు నిమిషాలు కళ్లు మూసుకుంది. ఇంతలో ఆ చెంబెడు నీళ్లూ ఆమెకి కొంచెం పుష్టి కలిగించాయి. వెంటనే ఆమె మెల్లిగా లేచి కూచుంది. "పడిపోతావు పడిపోతావు" అంటూ యెలిజబెత్తు ఆమె రెక్క పట్టుకుని ఆపింది; గాని తేలిపోతూ వున్న కళ్లతో ఆమె కమికిపోయిన తన శరీరాన్ని వొకమాటు చూసుకుని వొక్క పెద్ద నిట్టూర్పు విడిచి కళ్లు మూసుకుని యెలిజబెత్తు వొడిలోకి పడిపోయింది. అది చూసి యెలిజబెత్తు

"బిడ్డ తన గాయాలు చూసుకుని మూర్ఛపోయింది" అంటూ ఆత్రపడగా జకరయ్య గబగబ వెళ్లి మళ్లీ నీళ్లు తెచ్చి ఆమె మొంగమ్మీద చిలికాడు. యెలిజబెత్తు తన పమిటచెంగుతో మెల్లిగా మొగంతుడిచింది.

మరో నాలుగు నిమిషాలికి ఆమె మళ్లీ కళ్లు విప్పి లేచి కూచుంది.

"మీ రిద్దరూ భార్యాభర్తలా?"

"..................."

"అవును" అన్నాడు జకరయ్య.

"మీకు బిడ్డ లెందరూ?"

"వొక్క కొడుకు" అంది యెలిజబెత్తు"

"కూతుళ్లు లేరూ?"

"అయ్యో! ప్రభువా!"

"నన్ను కన్నవాళ్లకి నేను తొమ్మిదో యేట నే గర్భశత్రువు నైపోయాను. వా రిద్దరూ యిప్పటికీ బతికే వున్నారు; గాని జ్ఞానం వచ్చాక నేను మాతృప్రేమని, పితృవాత్సల్యాన్ని రుచేనా చూసి యెరగను. నా మొగం కనపడితే మా నాన్నకి కళ్లు చిమచిమలాడిపోతాయి. మా అమ్మ చేతులారా చంపలేక తప్పించుకు తిరుగుతోంది. నా మొగుడన్న పిల్లాడు చచ్చిపోయినందుకు ఆవిడ దుఃఖిస్తూనే వుంది; కాని నాకు సుఖం కలిగించడం— కష్టాలు తప్పించడం తన విధి అని ఆవిడ కూడా భావించలేదు. "అనుభవించు" ఇదే షష్టిగడియలూ ఆవిడ బోధన"

"ఇప్పుడా గొడవ లన్నీ యెందుకు తల్లీ?"

"ఇది వొక కెరటం. సముద్రంలో కెరటాలెందుకు వస్తాయీ? నా బతుకు సముద్రం అయిపోయింది. నన్ను మా వాళ్లే వితంతువుగా చేశారు; కాని కష్టాలు నేను అనుభవించాలి. జుట్టు తీయించకపోవడం వొకటే మావాళ్లు నాకు చెయ్యని అపకారం. నాలు గేళ్లనుంచి దానికోసం కూడా మా నాన్న రగడ పెంచుతూనే వున్నాడు; కాని నేను తరుచు మా చెల్లెలి దగ్గిర కాకినాడలో వుంటూ వుండడం వల్ల అది మాత్రం యింకా జరగలేదు"

"ఆయాసం వస్తుంది. అదంతా తరవాత చెబుదువు గాని లే అమ్మా"

"నా హృదయంలో నుంచి యీ దుఃఖం వుబుకుతోంది. దీనికి మీరు చూపుతూ వున్న ప్రేమే కారణం. మా జాతివాళ్లలాగ మీ దారిని మీరూ పోయి వుంటే నాకీ వుద్రేకం కలక్కపోవును. ఆధారం— "అయ్యో" అని సానుభూతి చూపించే వారు ఆకుకున్నారు; కనక పూర్వపు కష్టాలన్నీ జ్ఞాపకం వచ్చాయి. ....మీకు కూతుళ్లు లేరన్నారు. నా కిప్పుడు నన్ను కడుపులో పెట్టుకునే తల్లిదండ్రులు కావాలి. మీరు నన్ను కూతురుగా ప్రేమిస్తారా?"

ఈ మాట అనేటప్పటి కామె కంఠం గద్గదికమై నేత్రా లశ్రుపూరితా లయిపోయాయి. ఆసన్నివేశం చూశాటప్పటికి ఆదంపతులుకి కూడా అలాగే తటస్థించింది వెంటనే యెలిజబెత్తు ఆమెని పొదివి పట్టుకుని "తల్లీ! నువ్వు నా కూతురువు. నేను నీకు తల్లిని" అంది. జకరయ్య కూడా పుత్రికా వాత్సల్యంతో వోదార్చాడు. దీనితో యువతికి యేనుగు కున్నంత సత్తువ వచ్చింది. వెంటనే ఆమె యెలిజబెత్తుని గట్టిగా కౌగలించుకుని అతృప్త నయనాలతో ఆమె మొగం కేసి చూసింది. అప్పుడు యెలిజబెత్తు వుద్రిక్తహృదయంతో ఆమెని తన వక్షస్థలాని కదుముకుని, ఆమె కళ్లలో అమృతం వర్షించి, మాతృత్వానికి గురుగా ఆమె నొసట వొక్క ముద్దు వుంచింది. తరవాత యువతి జకరయ్యమీదకి చేతులు చాపగా అతనా చేతులు గట్టిగా పట్టుకుని "తల్లీ! నిన్ను యేసుప్రభువు మాకు దయచేశాడు ఆ ప్రభువునికన్న మేరీ అమ్మ నిన్ను రక్షించుగాక" అని డగ్గుత్తికతో చెప్పాడు.

"అయితే నన్ను మీయింటికి తీసుకువెళ్లండి. ఇక్కడ నన్నిం కేమీ అడగవద్దు" అని ఆమె కోరగా వారిద్దరూ "సరే" అన్నారు.

౪

ఇంతలో మహేంద్రవాడ రైతులు ముగ్గు రక్కడికి వచ్చారు. అందరూ శిలావిగ్రహాల్లాగ నుంచున్నారు; గాని అందులో వొకడు కొంతసేపటికి "యేమిటి గొడవ?" అని అడిగాడు. జకరయ్య దానికి తనకి తెలిసినంతవరకూ చెప్పి "రాయవరం వెళ్లి వొక బండి తెచ్చిపెడతారా?" అని అడగ్గా వారు ముగ్గురూ మారు చెప్పకుండా బోదె దాటి అరటితోటలో మాయమైపోయారు. అందుకు దంపతు లాశ్చర్యపడుతూ వుండగా, "మమ్మల్ని సాక్ష్యం వెయ్యడానికా? మేం తిరగలేం బాబూ పని మానుకుని" అని తోటలోనుంచి వినపడింది.

"నేను చెప్పలేదూ? మా పద్ధతి యింతే" అని యువతి చెప్పగా యెలిజబెత్తు "యేం మనుష్యులమ్మా" అని తెల్లపోయింది. జకరయ్య "దయా దాక్షిణ్యా లున్న వాళ్లైతే వీరు బండి తేవడం దాకా యెందుకూ? వారు కొట్టిన డొంకల్లోకి యీ డ్చెయ్యడం యెందుకు వస్తుందీ?" అన్నాడు.

దానిమీద యువతి "యిక యిక్కడ క్షణమేనా వుండడం మంచిది కాదు. నేను నడవగలను, నింపాదిగా పదండి" అంటూ తూలుతూ తూలుతూనే లేచి నుంచుంది. "వద్దు వద్దం"టూనే యెలిజబెత్తు కూడా లేచింది; గాని యువతి అంతలో రెండడుగులే వేసింది. ఇక చేసేది లేక జకరయ్య కూడా వెంట బయలుదేరగా యువతి యెలిజబెత్తు భుజంమీద తల ఆనుకుని నడుస్తూ "క్షణం. అర మైలే కాదూ మనం వెళ్లడం? బాధ లేదు, పదండి" అంది.

దారి పొడుగునా యెదురుపడ్డవా రంతా "యేమిటి సంగ"తని అడుగుతూ రాగా జకరయ్య "పుంతలో పడి వుంది. ఆసుపత్రికి తీసుకువెడుతున్నాం" అని మాత్రమే జవాబు చెబుతూ వచ్చాడు.

పావుగంటలో వారు రాయవరం చేరుకున్నారు. మరో పావుగంటలో ఆసుపత్రిలో యువతికి కట్టు కడ్డడమూ, మందివ్వడమూ జరిగిపోయింది. పొంత్తానికి యెనిమిదిం బావు అయ్యేటప్పటికి దంపతులు యువతిని వెంటబెట్టుకుని యింటికి చేరుకున్నారు.

అది చాలా చిన్నయిల్లు. పూరిల్లు కూడానూ. వొక గది, వొక వంటగది, వొక హాలు, మూడు వేపుల వసారాలు. ఇంతే ఆయిల్లు; కాని అది చూపులికి చాలా ముచ్చటగా వుంది. ఎటు చూసినా చాలా పరిశుభ్రమై గాలికీ వెలుతురికీ లోటు లేకుండా వాసయోగ్యంగా వుంది. ఇంటి చుట్టూ పువ్వుల మొక్కలూ, తీగలూ—అది వుద్యానవనంలో వున్న బంగాళాలా వుంది. ఆచక్కదనాని క్కూడా యువతి చప్పున తేరుకుంది.

యెలిజబెత్తు నిమిషాలమీద వంట చేసేసింది. అప్పటి కప్పుడే జకరయ్య స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. యెలిజబెత్తు యువతికి చాకింటి మడత కట్టబెట్టి ఆమెకీ, జకరయ్యకీ పింగాణీపళ్లెలలో అన్నమూ, కూరా వగైరా వడ్డించింది.

యువతి వొక్క క్షణం భ్రాంతురాలై వుండి, వుత్తరక్షణంలో ఆకాశంకేసి చూస్తూ అంజలిబంధంతో "ఈశ్వరా! అంతా నీకు తెలుసు. నువ్వే నాకు దిక్కు" అని మొక్కి భోజనం ప్రారంభించింది.

౫

ఇదంతా ముగిశాటప్పటికి పది అయింది. జకరయ్య యెలిజబెత్తుకేసి చూసి "ఇది మనం ధవళేశ్వరం చేరుకునే సమయం. అబ్బాయి రాజమండ్రి స్టేషనులో నిరుత్సాహపడి, కారణం తెలవని ఆవేదనతో బంగాళాకి వెళ్ళిపోయి వుంటాడు" అన్నా

డు. దానికి యెలిజబెతు "బిడ్డ నిరుత్సాహపడడం నిజమే; కాని ప్రభువు మనకీ పని పెట్టాడు. అబ్బాయి పుట్టిన రోజు వుత్సవంలో మనం అక్కడ అనుభవించే ఆనందం కంటే యిక్కడ యీబిడ్డకి సేవ చెయ్యడంవల్ల కలిగే ఆనందం గొప్పదిన్నీ, శాశ్వత మైనదిన్నీ. అక్కడ మిస్సమ్మగారి దయవల్ల బిడ్డకే లోటూ జరగదు. ఆకారణంవల్ల కూడా మన ఆనందానికి కొరత లే" దని మాతృహృదయాన్ని వెల్లడించింది.

ఇది విని యువతి "సంగతి యేమి?"టని అడిగి జకరయ్య అంతా చెప్పగా "అయ్యో! నామూలంగా మీ ఆనందానికెంత విఘాతం కలిగింది?" అని విచారించింది; కాని యెలిజబెతు "బిడ్డా! దానికోసం మాకు విచారం లేదు. నా కొడుకు పుట్టిన రోజున నాకు రత్నం వంటి కూతురు దొరికింది. మా మీద యేసుప్రభువుకి కటాక్షం వుందనడానికి ఇంతకంటే యేం నిదర్శనం కావాలి?" అని చెప్పి ఆమెని ఓదార్చింది.

దానిమీద యువతి యిలా చెప్పింది.

"నిజమే. నాకూ యివాళ 'అమ్మా!' అని పిలవతగిన తల్లీ, 'బాబయ్యా' అని పిలవతగ్గ తండ్రీ దొరికారు. ఈ సౌభాగ్యానికి సోపానంగానే నిన్న రాత్రి నేను పరమదౌర్భాగ్యం అనుభవించవలసి వచ్చింది. వాళ్ల క్రోధం దేవుని దయవల్ల నాకు అదృష్టంగా పరిణమించింది. ఇక నా సంగతి చెబుతా వినండి. నా పేరు సుభద్రమ్మ. మా కుటుంబం పాలమూరు నూరిళ్ల బ్రాహ్మణాగ్రహారంలోనూ చాలా యెన్నిక అయింది. బ్రాహ్మలంతా మా కుటుంబం అంటే యెంతో గౌరవంగా చూస్తారు. బ్రాహ్మణమాత్రులెవరూ మాయింటో ఆగలేరు. అంటే మాయింటో అందరూ నిప్పూ నీరూ కడుగుతారు. అలాంటి కుటుంబంలో నేనూ మా చెల్లెలూ మాత్రమే మారిపోయాం. నాకు ముగ్గురు అక్కలూ, వొక చెల్లెలూ, యిద్దరన్నలూ వున్నారు. నేను తరుచు కాకినాడలో మా చెల్లెలి దగ్గర వుంటున్నాను. మా మరిది కాలేజీలో మేష్టరు. అతనికి బ్రహ్మసమాజం అంటే అభిమానం. తల్లి యింకా బతికివుండడంవల్ల అతనింకా ప్రత్యక్షంగా ఆమతంలో కలవలేదు; గాని, కలిసినట్టే లెక్క. ఆమెకి యెనభైయేళ్లున్నాయి. నేడో రేపో అంటూ వుంది. "నన్ను కాస్త బూడిద చేసేసి తరవాత నీయిష్టం" అంది ఆవిడ. మా మరిది మూలంగా మా చెల్లెలూ, ఆయిద్దరి మూలానా నేనూ పూర్తిగా మారిపోయాం. మామరిది కాలేజీ నుంచి రాగానే మా కిద్దరికీ చదువు చెప్పడమూ, ఈకాలపు మర్యాదలూ, పద్ధతులూ నేర్పడమూ— పాపం అతగాడికి విసుగంటూ లేదు. ఇరుగు పొరుగు అంతా ఆమతస్థులే కావడంవల్ల తరుచు నేను వారి యిళ్లకు వెడుతూ వారి ఆచారవ్యవహారాలు చూస్తూ నేర్చుకుంటూ వుంటాను. ఆ స్త్రీల పరిచయంవల్లా, మామరిది బోధనలవల్లా బ్రాహ్మణజాతి అంటే రాక్షసజాతి అని బోధపడింది. వొక దయ లేదు. దాక్షిణ్యం లేదు. వేదాలూ, శాస్త్రాలూ చదవడమే; గాని అసత్యానికీ, హింసకీ జంకడం లేదు. నిప్పూ. నీళ్లూ కడగడం— యిలాంటివే బ్రాహ్మణలక్షణాలని వాళ్ల నమ్మకం. ......మా చెల్లెల్ని విడిచి వుండలేకపోవడం వొకటీ, పాలమూరు నరకంలో పడి బాధ పడలేకపోవడం వొకటీ—ఈ రెండు కారణాలవల్లా నేను తరుచు కాకినాడలో వుంటున్నాను. నాకు మళ్లీ పెళ్లి చేసుకోవాలని బుద్ధి పుట్టింది. ఈబుద్ధి పుట్టాటప్పటికి నామనస్సు పాలమూరిలో వొక బ్రాహ్మడిమీద పడింది. కానైతే అతగాడు పెద్ద చదువు లేమీ చదవలేదు. ఆస్తి కూడా సామాన్యమే. కాని చిన్నప్పు డిద్దరమూ ఆడుకునేవాళ్లం. మాలో మేము అతను మొగుడనీ, నేను పెళ్లాన్ననీ అనుకునేవాళ్లం. సరిగా సమయానికి, ఆరుమా

సాల క్రిందట అతని పెళ్ళాం కాపరానికి రాకుండానే కలరా వచ్చి చచ్చిపోయింది కూడానూ. మా మరిది కాకినాడలో యెన్నో సమ్మంధాలు చూపించాడు; గాని నామనస్సు అలా పోలేదు. మా చెల్లెలు "పాలమూరు బ్రాహ్మడు అంతపని చెయ్యలేడు సుమా" అంది. "పాలమూరు పిల్లని నేను చెయ్యగలిగినప్పుడు అతను మాత్రం యెందుకు చెయ్యలేడూ?" అన్నాను నేను. కాకినాడలో వుండడంవల్లే నాలో మార్పు కలగడం నిజమే. పాలమూరిలోనే వుండిపోడంవల్ల అతనిలో మార్పు కలగడాని కవకాశం లేకపోవడం గూడా వాస్తవమే; కాని నాఆశ అలా అనిపించింది...... ఈ ఆశతో పాలమూరు వెళ్ళాను. అతను పెళ్ళి ప్రయత్నంలోనే వున్నాడు; గాని యింకా స్థిరపడలేదు. అతని యిల్లు మాయింటిపక్క సందులోనే వుండడంవల్ల యెలాగో వీలు చేసుకుని పెళ్ళి మొదట పరామర్శ చేసి, తరవాత సమ్మంధాల సంగతి యెత్తి చివరికి అతికష్టంమీద "వితంతువుని పెళ్ళిచేసికోరాదుటోయీ?" అన్నాను. దానితో అతను ప్రకృతిలో పడ్డాడు. నాకేసి కొత్త చూపులు చూపించడం మొదలుపెట్టాడు. కొంచెం పరియాచకం—హాస్యం—వేళాకోళాలు—వెక్కిరింతలు—తుదకి ప్రేమభిక్ష; కాని పెళ్ళి చేసుకోవా లనే వుద్దేశం మాత్రం లేదు. కాలం గడుపుకోవడం—వీలయినపుడు మంచి పిల్లని చూసి పెళ్ళి చేసుకోవడం—ఇదీ యెత్తు; కాని యీ దురుద్దేశం నాకు తెలిసినప్పణ్ణుంచీ నేనతని యింటికి వెళ్ళడం మానేశాను. దాసీదానిచేత కభుర్లు వచ్చాయి. దారి కాసి బతిమాలడం—ఏమేమో వంకలు పన్ని మా యింటికే రావడం—ఇలాంటి వన్నీ సాగించాడు. అయితే; ఎన్ని బిత్తిరీలు చేసినా నేను లొంగలేదు. "పెళ్ళి చేసుకుందాం. లేకపోతే దూరంగా వుండు" అని నేను కచ్చితంగా చెప్పేశాను. ఇదంతా అయేటప్పటికి పదిహేను రోజు లయింది.

......తరవాత యేం జరిగిందో తెలవదు; గాని వొకనాడు సాయంత్రం దాసీది వొక జాబు తెచ్చి యిచ్చింది. "నీ సెలవు ప్రకారం నిన్ను పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకున్నాను. నువ్వెప్పుడు ఎక్కడికి రమ్మంటే అక్కడి సిద్ధం" అని వుంది ఆజాబులో. మొదట కొంచెం అనుమానపడ్డాను; గాని చివరికి పొంగిపోయాను. ఈ వయస్సులో కోరుకున్న భర్త లభించడం కంటే ఆడదానికి కావలసిం దేమిటీ? కాని జాబు వచ్చిన యింకో గంటకి ప్రళయం ముంచుకు వస్తోన్నట్టు తెలిసింది. మారహస్య వ్యాపారం కొందరు విద్యార్థులు కనిపెట్టారు. అది అనోటా, ఆనోటా పాకింది. చివరికి మా అమ్మకి తెలిసింది. మా అమ్మ మా పెద్దక్కతో చెప్పింది. అది వచ్చి "యేం తలుచుకున్నావే మొండి పీనుగా" అంటూ నన్నొక్క మొట్టు మొట్టి అడిగింది. అంతట్లో మా అమ్మ వచ్చి "వూరుకో. వూరుకో రేపు మీనాన్నతో చెబుదాం బుద్ధి మళ్ళించుకోకపోతే" అంటూ మా అక్కని లాక్కుపోయింది; కాని నా పై ప్రాణాలు పైకెగిరిపోయాయి "యిది యెలా పాక్కిందీ? ఏమవుతుందీ? ఇది మొగాళ్ళకి తెలిస్తే పెళ్ళి మాట దేవు డెరుగును. ఇంకనన్ను కాకినాడ వెళ్ళనిస్తారా? బుర్ర గొరిగించకుండా వుంటారా? ఈ నరకంలో పడి బతకడ మెలాగా?" ఇలాగ నా మనస్సు అనేకవిధాల పోయింది. నిజంగా కంగారైపోయింది నాకు........ ఆ వేళ సాయంత్రం దాసీది మరో చీటి తెచ్చి యిచ్చింది. చూడగా దాంట్లో "మన సంగతి బట్టబయలైపోయేటట్టుంది. ఇక యిక్కడ వుంటే మనకి ప్రాణాలు తక్కువ. తక్కినా నువ్వొక తల యెత్తుకుని తిరగడానికి వీలుండదు అంతా అయోమయం అయిపోతుంది. కనక రాత్రి పన్నెండు గంటల వేళ నువ్వెలాగేనా చెరువు దగ్గిరికి వస్తే నేను కలుసుకుని మారు దారిని తెల్లవారేప్పటికి నిన్ను కాకి

నాడలో మీ చెల్లెలిగారి యింటో వప్పగిస్తాను. వెంటనే—రేపే మనం పెళ్లి చేసేసుకోవచ్చు''నని వుంది......నాకు మళ్ళీ ఆశ కలిగింది. విరుచుకు పడిపోయే ఆపద తప్పిపోయినట్లు తోచి మనస్సు కొంచెం కుదుటపడింది; కాని రాత్రి పన్నెండు గంటలవేళ చెరువు గట్టుకు వెళ్ళాలి. యెలాగా? రాత్రి మా పెద్దక్క కాస్తే యేమిటి చెయ్యడం?......అప్పటి స్థితి యెలా వుంటుందో? వెళ్ళాలి. తప్పదు'' అని నిశ్చయించుకున్నాను.... నాకు నిద్ర రాలేదు ముసుగు—గాలికూడా ప్రవేశించడానికి వీలు లేనట్టు బిగించాను; కాని వేయి కళ్ళతో చూస్తూన్నట్టు అంతా కనిపిస్తూనే వుంది. లక్ష చెవులతో వింటూన్నట్టంతా వినపడుతూనే వుంది......పక్కయింటో గడియారం పన్నెండు కొట్టింది......మెల్లిగా ముసుగు తీసేశాను. అది శీతాకాలం కనక అందరూ గాఢనిద్రలో వున్నారు. లేచి, ముంగాళ్లమీద నడిచి, మెల్లిగా తలుపులు తీసుకుని—క్షణంలో చెరువుగట్టుమీద పడ్డాను. ......అప్పటికప్పుడే అత నక్కడ కనిపెట్టుకుని వున్నాడు...... "ఇప్పుడనపర్తి వెడితే తప్పకుండా మీ వాళ్ళు వెతుక్కుంటూ వచ్చి పట్టుకుంటారు. రాయవరం వెళ్ళి జట్కామీద రామచంద్రపురం చేరుకున్నామంటే ప్రత్యేకంగా మోటారు చేసుకుని తూర్పు తెల్లవారకుండా కాకినాడ వెళ్ళిపోతాం. ఏమంటా''వన్నాడతను. నాకూ అది బాగానే కనపడింది. "సరే" అంటే "సరే" అనుకున్నాం .....బయలుదేరాం. మాకు చీకటి అడ్డు రాలేదు. చలికూడా కనపడలేదు. ఇద్దరమూ వొక మాటా మంతీ కూడా లేదు. ఉరుకుల తోటీ, పరుగులతోటీ వెనక్కాల మమ్మెవరో తరుముకు వస్తూన్నట్టు మేఘాలమీద యెగిరిపోతున్నాం......కాని మావాళ్ళు మా వెనక్కాలే వస్తున్నారు. మే మది కనిపెట్టే లేకపోయాం. నేను పడివున్నచోటికి వచ్చాటప్పటికి మా చిన్నన్నయ్య వచ్చి "మూదిగిముండా! యెక్కడికి వెళ్తా''వంటూ చెయ్యి పట్టుకున్నాడు.....దాంతో నేను కెవ్వున కేక వేసి కూలబడ్డాను. వెంటనే మా నాన్న దెబ్బమీద దెబ్బ కొట్టసాగాడు. మరో నిమిషానికి మా అన్నలు కూడా సాయపడ్డారు.... అందరూ నన్ను గొడ్డుని బాదినట్టు బాదేశారు. చివరికి కర్రదెబ్బ నెత్తిమీద పడింది. అంతే. దాంతో నాకు కళ్ళు తిరిగిపోయాయి. తరవాత యేం జరిగిందో! ఎవ ళ్ళేమయిపోయారో!...... తెల్లవారేక—అంతా మీకు తెలిసిందే''

ఇది పూర్తి అయేటప్పటికి సుభద్ర హృదయం తేలికపడింది.

ఇది విని దంపతు లిద్దరూ "యేసుప్రభువా!" అంటూ నిట్టూర్పులు విడిచారు.

౬

"అమ్మా! డాక్టరుగారి నడిగి సర్టిఫికెట్టు తెమ్మంటావా?" అని జకరయ్య అడగ్గా "బాబయ్యా! యేసుప్రభువుకి గూడా సర్టిఫికెట్టు కావాలా?" అని సుభద్ర బదు లడిగింది.

"కోర్టుకి వెడితే సాక్ష్యం యెలా వస్తుందీ—?" అని యింతవరకూ తొక్కుళ్ళాడుతూ వున్న జకరయ్య యిది విని గతుక్కు మన్నాడు.

అక్కడ, పాలమూరిలో ప్రజలందరూ రాత్రి వీరావధాని చేసి చేయించిన దారుణకృత్యం విని ఆశ్చర్యపోతూ వుండగా సుభద్రమ్మ కిరస్తాలలో కలిసినట్టు వార్త వచ్చింది. దీనితో వూరంతా గుబ్బుమని పోయింది.

వీరావధాని. పెద్ద కొడుకూ నిర్విచారంగానూ, సావకాశంగానూ దేవతార్చనా భోజనమూ చేసి లోపలి అరుగుమీద కూచుని "ఏం జరిగిందో?" అని ఆలోచిస్తూ వుండగా చూసి రావడానికి వెళ్ళిన రైతు వచ్చి తెల్లవారింది మొదలు జరిగిం దంతా చెప్పాడు. అదివిని లోపల్నుంచి వచ్చి పెద్ద కూతురు

"అది చచ్చిపోయిం దనుకుందాం. ఏం ?" అంది; కాని యీ మాట వినిపించుకోకుండా అవధాని "నా పిల్లని లేవతీసుకుపోయా రని కిరస్తానీ వాళ్ళమీద ఛార్జీ తగిలిపించా" అంటూ బుసబుసలాడుతూ గభీ మని లేచినుంచుని నడుం బిగించాడు. ఆ వుధృతం చూసి రైతు తెల్లపోతూ వుండగా పెద్ద కొడుకు "నువ్వు తొందరపడకు నాన్నా!" అని శాంతపరిచి "పేరిశాస్త్రిని తీసుకు రా" అంటూ తమ్ముణ్ణి పంపించాడు.

"ఏం నాన్నా! ఇదంతా చేసింది రామశర్మ గాడు కదా. వాణ్ణి విడిచిపెట్టి కిరస్తానీల మీద యివ్వడం యెందుకూ ఛార్జీ ? ఇలాంటి వెధకలు వూళ్ళో వుంటే తక్కిన వెధవపిల్ల లంతా చెడిపోతారు" అని పెద్దకూతు రంది; కాని అవధాని దానికి జవా బివ్వలేదు.

పేరిశాస్త్రి వచ్చాడు. అత నా వూళ్లో ఏజెంట్లలో ప్రముఖుడు. చూస్తూ వుండగా తల మార్చి తల పెట్టడంలో చాలా తెలి వైనవాడు.

శాస్త్రి అంతా విని పక్కా పావుగంటసేపు ఆలోచించాడు. ఈ లోపుగా అవధాని "రెండు వేల రూపాయల నగలతో గూడా లేవతీసుకుపోయినట్టు ఛార్జీలో చేర్పించా"లని ధృవపరుచుకున్నాడు.

"కిరస్తానీల మీద ఛార్జీ యివ్వా లంటారా ?"

"అవును"

"మీ అమ్మాయిని వాళ్ళే లేవతీసుకుపోతే మరి దాని వొంటిమీద దెబ్బ లెలా వచ్చాయీ ?"

"......................"

"కిరస్తానీల ప్రోత్సాహంతో సుభద్రే మీ మీద ఛార్జీ యిస్తే !"

అవధానికి మాట రాలేదు. కొడుకు లిద్దరూ శాస్త్రికేసి చూస్తూ కూచున్నారు. అప్పుడు పెద్ద కూతురు "వంశంలో యిలాంటి వెధవపీనుగులు పుడితే అన్ని చిక్కులే కాకపోతే మరే మౌతుందీ? నాలు గేళ్లనుంచి పోరుతున్నాను దాని కూడా బుర్ర గొరిగించెయ్య మని. విన్నారా యెవ రేనా?" అని టకాయించి అడిగింది. ఆమె యిలా అంటూ వుండగా "యేమి టేమిటి ?" అంటూ ముసలావిడ వచ్చింది; కాని యెవరూ సమాధానం చెప్పలేదు.

"కిరస్తానీలమీద మీరు ఛార్జీ యిచ్చినా, మీ మీద సుభద్ర ఛార్జీ పెట్టినా మీ పని కష్టపు చింపుకుంటే కాళ్లమీద పడ్డట్టవుతుంది. మీరు కొట్టిన దెబ్బలు చాలా దారుణంగా వున్నాయిట. అవి చూస్తే యెలాంటి వాళ్ళూ కూడా మీపక్షంగా మాట్లాడలేరుట. పైగా "ఫలానా కిరస్తానీని పెళ్ళాడడానికి స్వయంగా నేనే వెళ్ళిపోయా" నం టుంది మీ అమ్మాయి. అదిమీకు మరీ అపకీర్తికరం"

"......................".

"కనక, మీ రిప్పుడు కానుకోవడంలోనే వుండాలి. ఇంతకీ: అక్కడి వుద్దేశాలూ, ప్రయత్నాలూ యెలా వున్నాయో తెలుసుకోవాలి. వీలు తప్పితే పది రూపాయలు పారేసేనా కేసు రాకుండా చేసుకోవాలి; గాని, మనకి మరో దారి కనపడదు. ఈస్థితిలో రామశర్మమీద ఛార్జీ పెట్టినా మనకి చిక్కే. ఏమంటే ? స్థితి యెలాగా విషమించింది కదా అని వాడు కిరస్తానీలతో లాలోచీ అయితే ?"

"......................"

"ఎన్ని విధాల చూసినా నాకు, మీకు అనుకూలించే సాధనా లేమీ కనపడ్డం లేదు. ఏమీ ఆలోచించకుండా దారుణ మైన పని చేసేశారు. ఇప్పు డది విషమించుకూచుంది"

అప్పుడు ముసలావిడ అందుకుంది.

"కూచోదూ ? కూచోదా అంట. అది యిల్లు దాటిం దని తెలిశాటప్పటికి ముగ్గురూ కర్రలు పుచ్చుకుని యములాళ్ళలాగ బయలుదేరారు. వెనకాల నే నెంత మొత్తుకుంటూ వున్నా విన్నారా? యీ పెద్ద పీనుగు కూడా వాళ్లని యెగసం దో

సింది; గాని వెనక్కి తియ్యలేకపోయింది. ఇక వెనకా ముందూ చూడకుండా దూది యేకినట్లు—"

"ముండిపీనుగా! పోరి, దాన్ని కాకినాడ పంపించినదానవు నువ్వా? ఆ బ్రహ్మసమాజంగాడు దాని బుద్ధి మార్చేశాడు. వాడిక నాగుమ్మంలో అడుగుపెట్టగలడా? అసలు నీబుర్ర పగలగొట్టవలసింది. అలా చేస్తే దానికి బుద్ధి వచ్చును"

ఆవిడ, ముసలాయనికి జవాబు చెప్పబోగా: కొడుకులూ, పెద్దకూతురూ కొట్లకుక్కల్లాగ ధామధూములు చేశారు; గాని ఆమె వెనక్కి తగ్గలేదు. "వారే పేరన్నా? వీళ్లెంత గింజుకున్నా నాది కన్నకడుపురా నాయనా! కిరస్తానీది కావడం కంటే మళ్లీ పెళ్లి చేసుకోవడం మంచిది కాదట్రా? ఏమాదిగాడికో కట్టబెడతారు; గాని కిరస్తానీలు మాత్రం దానికి పెళ్లి చెయ్యకుండా వూరుకుంటారట్రా? వీళ్లెంత యెగిసెగిసి పడ్డా లోకులు వాణ్ణి చూసి "పెద్దావధానులుగారి నాలుగో అల్లు" డని చెప్పుకోరట్రా? నా కడుపు తరుక్కుపోతోందిరా నాయనా! రాత్రి తెల్లవార్లూ డొంకల్లో అది యేం బాధపడిందో? వీళ్ళు కొట్టిన దెబ్బలతో పాటు ముళ్లే గుచ్చుకున్నాయో, తేళ్లే కుట్టాయో, పాములే కరిచాయో, నక్కలే పీకేయో—వెర్రి పిల్ల యెంత కందిపోయిందో? ఎన్ని గాయాలు తగిలాయో? (గుండెలు బాదుకుంటూ) "అమ్మా" అని నన్నెంత తలుచుకుందోరా తండ్రీ? మనస్సు విరిగిపోబట్టిగాని అది కిరస్తానీలలో కలిసే మనిషట్రా? మళ్లీ జన్మకి నీకడుపున పుడతాను గాని అది కాకినాడలో చెల్లెలిదగ్గిరికి చేరుకుని వుపాయం చేస్తూ తండ్రీ" అని బతిమాలుతూ ఆమె బోరు మంది.

పేరిశాస్త్రి మాట్లాడలేకపోయాడు; గాని తతిమ్మా అందరూ ఆమెని దులిపేశారు. దాని మీద ఆవిడ యిక చేసేది లేక "దాన్నేడిపించిన వాళ్లు ముందుకు రా" రంటూ గిరుక్కున యింటోకి చక్కాపోయింది.

"కిరస్తానీలు ఛార్జి యిస్తా రంటావా?"

"ఇవ్వడానికి మార్గా లున్నాయి. ఇస్తే మిషనరీ దొరలు వచ్చి స్వయంగా పని చేస్తారు. దొరలు పని చేస్తే కేసు బిగవక పోదు"

"......................"

"పైగా ఇప్పుడు మన మేస్ట్రీటు తురక కూడానూ. అగ్గికి గాలి—"

"ఏమిటి దారి?"

అవధానికి శరీరం స్వాధీనం తప్పిపోయింది. మాటకూడా తడబడడం మొదలుపెట్టింది.

"వూరుకుంటా వేమిరా?"

"ఏం చెయ్య మంటావూ?"

"వుపాయం లే దంటావా?"

"లక్ష వున్నాయి; కాని మాటలతో—"

"పారేద్దాం. ఏమాత్రం అవుతుం దంటావు?"

"అక్కడి సంగతు లేమీ తెలవకుండా యేం చెప్పగలనూ?

"అయితే వెళ్లిరా"

"నాచేత నైనంత పని చేస్తాను"

"ముం దేమాత్రం కావా లంటావు?"

పెద్ద కొడుకిలా అడగ్గా అవధాని "వో కాగితం యివ్వరా. పేరన్న మింగేస్తాడా యేమిటి!" అన్నాడు. వెంటనే పెద్దాతను నూరు రూపాయల నోటు తెచ్చి శాస్త్రి కిచ్చాడు.

శాస్త్రి తప్పని సరి వచ్చినట్లు నటిస్తూ దాన్ని పుచ్చుకుని పైకెత్తిపట్టి "యిది అగ్నిహోత్రం. కనక అతి జాగ్రత్తగా వాడతాను. ఇది యిలా వుండగానే పని జరిగిపోవచ్చు, లేక దీనితోనే సరిపోవచ్చు. చాలకపోవడంకూడా రావచ్చు; అయితే యిప్పు డేమీ చెప్పలేను. మీ రేమీ బెంగపెట్టుకోవద్దు; కాని కొంచెం—సాక్ష్యం తయారు చెయ్యడం మాత్రం మరచిపోకండి" అని చెబుతూ

అమ్మాయి ఆరోగ్యం విషయంలో చాలా శ్రద్ధ వహిస్తా రని నమ్ముతున్నాను. తరుచు వుత్తరాలు రాస్తూ వుండండి. తీరిక అయినప్పు డల్లా—సెల వయితే మే మిద్దరమూ వచ్చి—"

"ఎంత మాటా? మాయింటికి రావడానికి మీకు సెలవు కావాలా?"

"మీరు విద్యాధికులు, పెద్ద పదవిలో వున్నారు. నేను మీయెదట—"

"మనిషికి వున్నతి కలిగించేవీ, గౌరవం కలిగించేవీ చదువూ పదవీ యెంత మాత్రమూ కావు. మంచి చెడ్డలు గ్రహించే శక్తి యెవరి కుంటుందో, ఆ వివేచనని తమ నడతలో యెవరు చూపిస్తారో వారూ పెద్ద లంటే. ఈదృష్టితో చూస్తే మీరు గురువులూ, నేను శిష్యుణ్ణీ"

"తమ రలా సెల విచ్చెయ్యద్దు. మీతో వాదించి నేను నెగ్గలేను......అమ్మాయికి శీఘ్రంగానే సంపూర్ణారోగ్యం కలుగుతుం దనీ, తరవాత వెంటనే యోగ్యు డైన వరుణ్ణి చూసి పెళ్లి—"

"బాబయ్యా! ఇక అప్రస్తావన వద్దు. పెళ్లి మీద ఆశ నాకు పూర్తిగా మళ్లిపోయింది. మళ్లీ అది కలుగుతుం దని గాని, కలిగినా ఇంతలో కలుగుతుం దని గాని చెప్పలేను. తన్నే నమ్మి వచ్చిన నన్ను యములాళ్ల కప్పగించి పిరికిపంద—ఆపిల్లాడు పారిపోయినప్పుడే నాకు పెళ్లంటే అసహ్యం పుట్టింది. స్త్రీల మానం కాపాడలేనిజాతి యిది. స్త్రీల జీవితలక్ష్యాన్ని అర్థంచేసుకోలేనిమతం ఇది. స్త్రీకియుక్తవయస్సురాకుండానేపెళ్లిచేసెయ్యా లనే నిర్బంధాన్ని సృష్టించడానికి ముఖ్యకారణం యేమిటో నాకిప్పుడు స్పష్టంగా బోధపడింది. జాతి కనుగుణ మైన విద్య నేర్చిన బాలిక నిజంగా స్త్రీ రత్నం అవుతుంది. అలాంటి రత్నాన్ని సంపాదించా లంటే పురుషుడు పురుషకారాన్ని చూపించాలి. అది చూపించలేనివాడు శాశ్వతబ్రహ్మచారిగా వుండి పోవలసిందే; గాని మరి దారి లేదు. అప్పుడు స్త్రీ ప్రాణికోటికి సహజ మైన సౌఖ్యమూ, ఆనందమూ అనుభవించడానికి జాత్యంతరుణ్ణి కూడా కోరితే కోరవచ్చు. ఇదే తటస్థిస్తే దేశానికి వొక విధ మైన దౌర్భాగ్యం కలుగుతుం దంటే నిజమే: ఇలాంటి వేమీ తటస్థించకుండా వుండా లనే మన పూర్వులు స్త్రీని పశువుగా తయారు చేసే సన్నివేశాలు కల్పించారు. అయితే వారు స్త్రీ పశు వయి పోతే ఆ స్త్రీల చేతుల్లో పెరిగే మొగపిల్లలు పశుపతు లయిపోతా రని గ్రహించలేకపోయారు. ఇలాంటి అవిచారితధర్మాల నేర్పరచడంవల్ల తామే పశువు లయిపోవడం కూడా వారుగమనించలేకపోయారు. త్రికాలజ్ఞానసంపన్ను లని పొగడబడే మునులు ఇలాంటి అపసిద్ధాంతాలు ఏర్పరిస్తే జాతి నిర్వీర్యం అయిపోతుం దనీ, దేశం అన్యాక్రాంతం అయిపోతుం దనీ గ్రహించలేకపోయారు...... ఇంతకీ; మామరిదిగారి బోధనలవల్ల నాకు ప్రపంచకం అంటే యేమిటో, స్త్రీ కర్తవ్యం యేమిటో విశద పడ్డాయి. మీ సౌజన్యాన్నీ, మీ కర్తవ్యపరాయణ తనీ చూడడంవల్లా, అనుభవించడంవల్లా నాకు నేను చెయ్యవలసిన పని కూడా తెలిసింది. కనక నే నిప్పుడు పెళ్ళిసంగతి వెనక్కి తీసేస్తూన్నాను. ఆంధ్రస్త్రీలోకం యిప్పుడు నానాబాధలూ పడుతోంది. నాజీవితా న్నంతా స్త్రీలకూ పిల్లలకూ సేవచెయ్యడంలో గడిపేస్తాను. సేవలో వుండే సౌఖ్యమూ, ఆనందమూ మరి దేనివల్ల కలిగే వాటికీ తీసిపోవు. మీరంతా నాకు ఈసేవాదీక్షలో విజయం కలిగేటట్టు ఆశీర్వదించండి"

ఈమాటలు విని అంతా చకితు లైనారు. చూడగా సుభద్ర మొగమ్మీద విలక్షణ మైన తేజస్సు ధగధగ మెరసిపోతోంది.

* * * *

విడిపోవలసిన క్షణం వచ్చింది. అందరూ కూడా మాట్లాడలేక మిడుతూ మిడుతూ చూసుకున్నారు. డ్రైవరుకి కూడా మాంద్యం వచ్చింది. మేఘాల మీద యెగిరిపోయే మోటారు కూడా మలుపు దాటీ దాకా కాళ్ళడ్డుకుంటూనే వెళ్ళింది.

తెలుగు టాకీలు—వాటి ముందుగతి

ఏ. వి. సీతారామయ్యగారు ఎం. ఏ. ఎల్. ఎల్. బి

(అవి టాకీ లైనా, మూకీ (silent) లైనా సినిమా ఫిలుములను గురించి యిలాంటి వ్యాసాలు రాయడానికి శీతారామయ్య పంతులు గారికి ప్రత్యేకార్హత వుంది. వీరు చాలా కాలంనుంచి నాటకాలను చదువుతూ, ప్రదర్శనాలను చూస్తూ ఆకళవిషయంలో చాలా పరిశ్రమ చేస్తున్నారు. ఇటీవల అంటే ౧-౧-౩౨ తేదీని ఆంధ్రనాట్యపరిశోధకమండలి అన్న పేరితో వొక సంస్థను ప్రారంభించి దానికి తామే సెక్రటరీగా వుంటూ పంతులుగారు చాలా పని చేస్తున్నారు. ఈ సందర్భంలో అసంస్థ ఆదర్శాల ననుసరించి వీరు, ప్రచురించబడుతూ వున్న నాటకాలను విమర్శిస్తూ, ఆడడానికి యోగ్యా లైన వాటిని సూచిస్తూ, ప్రదర్శనాలను విమర్శిస్తూ కృష్ణాపత్రిక, ప్రజామిత్ర, సమదర్శిని మొదలైన పత్రికలలో తరుచు అనేక వ్యాసాలు ప్రకటిస్తూ మంచి ప్రచారం చేస్తున్నారు. ఇటీవల వీరు ఫిలుము పరిశ్రమవిషయంలో పరిశోధనలు చెయ్యడానికి కలకత్తా వెళ్ళి రెండు మాసాలుండి అక్కడి స్టూడియోలన్నీ చూసి, పెద్దల నందర్నీ కలుసుకుని మాట్లాడి వచ్చి వున్నారు. చాలాకాలంనుంచి sound and shadow మొదలైన ఇంగ్లీషుపత్రికలలో ఈవిషయం మీద యెన్నో వ్యాసాలు ప్రకటించారు, ఇంకా ప్రకటిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే వీరు వేల్ పిక్చర్సు స్టూడియో చూసిరావడానికి మద్రాసు వెళ్లబోతున్నారు. ఈవిషయంలో యిలాగ ప్రత్యేకపరిశ్రమ చేసి—చేస్తూ వున్న పంతులుగారు సినిమాలను గురించి భావబంధురా లైన వ్యాసాలను ప్రబుద్ధాంధ్రలో ప్రకటించడానికి పూనుకున్నారు. ఈ చిన్న లేఖ వాటికి వుపోద్ఘాతరూప మయింది. మా పాఠకమహాశయులు పంతులుగారి వ్యాసాలు జాగ్రత్తగా చదివి ఆదరిస్తా రని ఆశిస్తున్నాం.

సంపాదకుడు)

ప్రస్తుతం మన దేశంలో బాగా లాభకారిగా వున్న పరిశ్రమ ఫిలిం పరిశ్రమ. అందులో దేశంలోకి టాకీ లొచ్చిం తర్వాత యీపరిశ్రమ మరీ విజృంభించి రెండు మూడు సంవత్సరాలలో యిదివరకు కంటే పది పదిహేను రెట్లు అధికంగా ఫిలిం స్టూడియోలు తయారయాయి. ఉత్తర హిందూస్థానం బొంబాయి రాష్ట్రాలలోని ధనవంతులు దీంట్లో వున్న లాభాలు గుర్తించి విరివిగా ధనం పెట్టుబడి పెట్టి అపారంగా ధన మార్జిస్తూంటే మనవాండ్లు గుడ్లు మిటకరించి చూస్తూ కూర్చుని తమ కున్న ధనం ఎలెక్షనులకూ వగైరాలకూ తగలేసుకుంటున్నారు. ఆఖరికి ఇతరరాష్ట్రాల పెట్టుబడిదారులు తమ వ్యాపారాన్ని మన రాష్ట్రంలోకి గూడా వ్యాప్తి చెందించి మన కళను తమ ధనార్జనకు తార్చి నాశనం చేసి మన ధనాన్ని పీల్చివేస్తున్నా మనవాళ్లు మేల్కొలేదు. ఇప్పుడిప్పుడే మద్రాసులో వొక స్టూడియో పెట్టారుట మనవాళ్లు. అది ఎంతవరకు నికార్సయిన తెలుగు స్టూడియో అని చెప్పకోటానికి వీలవుతుందో నేను చెప్పలేను.

టాకీ పరిశ్రమ విషయమై కొంచె మైనా పరిశ్రమ చేసినవాడికి ప్రస్తుతం మన తెలుగుటాకీల పరిస్థితులు గమనించి చూస్తే విచారం కలుగుతుంది. ఈవ్యాపారం విషయం బొత్తిగా తెలీక కేవలం కళాదృష్టితో చూచే వాడికి కోపం కూడా కలుగుతుంది. తెలుగు టాకీల ప్రస్తుతస్థితి గనక టూకీగా చెప్పా లంటే—స్వంత ఖర్చుల మీదనైనా సరే తయారవటానికి సిద్ధంగా వున్న నటులు. తెలుగు నటులను గురించి ఏమాత్రం తెలియని ఫిలిం కంపెనీ ఏజంట్లు; వీళ్లే తీయబోయే ఫిలింకు కావలసిన నటుల్ని ఏరి దీసుకుపోయేవారు. చవక బారు నటులతో లాభాలమీదనే దృష్టి వుంచి ఫిలిములు తీశే పెట్టుబడిదారులు. తీశే కథ

యొక్క భాష అయినా తెలియని డైరెక్టరులు. ఇదీ ప్రస్తుత తెలుగుటాకీల చరిత్ర ఈ పరిస్థితులలో తెలుగుటాకీలు బాగా లేవంటే ఆశ్చర్య మేముంటుందీ? ఉదాహరణగా; ఇంతవరకు తీయబడిన తెలుగుటాకీలలో వొకటి, నిరక్షరకుక్షులైన నటులు. వాళ్లని ఏర్పాటు చేసుకున్నది తమిళ సోదరుడు. ఫిలిం తీయించేది మార్వాడీ. డైరెక్టరు సాహేబు. కథ మన రాష్ట్రానికి ప్రత్యేకంగా సంబంధించినది. తీశేది బెంగాలులో!!!

కాని మన తెలుగు టాకీలకు డబ్బు రావడం లేదా అని అడగొచ్చు యెవరైనా. నిజంగా రాదగిన దాని కంటె చాలా యెక్కువగా వొస్తోంది. కారణం తక్కిన దేశభాషలలోని టాకీల మాదిరే మనవాళ్లకి భగవంతుడి పేరు చెప్పి ఏంచేసినా వూరుకుంటారు. అందువలననే మన టాకీ లన్నీ పౌరాణిక గాధలు తప్ప సాంఘిక విషయాలు వుండవు. టాకీలు రాకముందే పౌరాణిక గాధలతో విసిగి వున్న ప్రేక్షకులకు టాకీలో విచిత్రంగా తెరమీద మాట్లాడే బొమ్మలుగా వచ్చినై గనక గాని లేకపోతే యింత హడావిడీ వుండదు. ఎన్నాళ్లు నిలుస్తుంది ఆవినోద భావము? అవింత? సరిగా గనక తీస్తే యీపురాణగాధల్తోనే యింకా చాలాకాలం గడపొచ్చు తెలుగులో. కాని యింతవరకు తీసిన వాటిని బట్టి తెలుగు టాకీల ముందుగతి ఆలోచిస్తే పరిస్థితులు ఆశాపూరితాలుగా లేవు.

మొదటికారణం పాత్రధారులు. ఇంతవరకూ మన తెలుగు నటుల్ని ఏమాత్రమూ యెరగని వాళ్లు నటనిర్ణయం చేయడం. అందువల్ల మన నాటకాలలో వ్యాప్తి చెందివున్న కంట్రాక్టు పద్ధతే అక్కడ కూడా జొరబడింది. ఫిలిం కంపెనీ యజమాని చేత పంపబడిన ఏజంటు మన దేశంలోని పరిస్థితులు తెలియని కారణం వల్ల ఏ ఏజంటుకో లోబడిపోతాడు. ఏజంటు ఆఫిలింకు కావసిన 'సెట్టు' నంతా తీసుకు రావడానికి కొంత మొత్తానికి వొప్పుకుంటాడు. కంట్రాక్టరుయొక్క సెట్టు ఫిలింకంపెనీ యజమాని వొప్పుకుండేట్లు చేయడానికి ఏజంటు కాంట్రాక్టరు వద్దనుంచి కొంత కమిషను పుచ్చుకోవడం కూడా కద్దు. సెట్టు యెంత చవకగా తయారైతే అంత లాభం కాబట్టి కాంట్రాక్టరుకు అతడుతమ్మాయిజగ్గాయీలనందర్నీ పోగువేసుకుని ముఖ్యమైన ఏ వకరిద్దరికో కాస్త పారేసి ఫిలిం కంపెనీకి తీసుకుపోతాడు. ఈఫిలిం తీయడంలో కంపెనీ యజమానికి హిందీ ఫిలిము మీద నున్న అభిమానం దీనిమీద వుండదు. కారణం ఇది వొక చిన్నరాష్ట్రానికి సంబంధించినదే గాబట్టి. అందువల్ల తెలుగు ఫిలిం తీసేటప్పుడు స్టూడియో అందరికీ నిర్లక్ష్యమే.

సెట్టు స్టూడియో చేరంగానే డైరెక్టరు ఛార్జిలో పడుతుంది. ఇంతవరకు మన ఫిలిములు డైరెక్టు చేసిన వాళ్లకి తెలుగు భాషే రాదు. ఫిలిము తయారవడానికి డైరెక్టరు యొక్క బాధ్యతను గురించి వ్రాస్తే ప్రత్యేకవ్యాసమే రాయాల్సి వస్తుంది. అది మరో మారు ముచ్చటిస్తా. నటులు చెప్పే పోర్షను తెలిస్తే గద వాళ్ల యాక్షను సరిగా వుంది గదా అని తెలిసేది? పాడే కీర్తనలు పద్యాలూ సమయోచితంగా వుండి సందర్భానుసారంగా పాడబడుతున్నయ్యా అంటే భాష తెలియాలి గద. భాషే తెలియని డైరెక్టరు డైరెక్ష నేమిటి అంటే మాకు చాలా అనుభవముందంటూ కస్సు మంటారు. ఇంతకీ పెట్టుబడి వాళ్ల చేతులో వుంది. వాళ్లు ఇష్ట మొచ్చి నట్లు ఆడుతున్నారు.

తరువాత నాటకం ఫిలింకు తగినట్లుగా రాయడం కథకు కావాల్సిన దుస్తులూ, వాతావరణం మొదలైనవి ఏర్పరచడానికి ప్రత్యేకనిపుణులు గావాలి. వాళ్లందరికీ కథ తెలిసి వుండాలి. నాటకాన్ని ఫిలింకు సరిపరచడం అదో ప్రత్యేకకళ. మన తెలుగు టాకీలలో ఈ విషయా లన్నీ గాలికి

వదిలేసి ఫిలిం యివ్వడానికి పోయిన నటశ్రేష్ఠుల సలహాల మీద అన్నీ తయారుచేసి ఏసాహేబు చేతనో డైరెక్టయించనిపిస్తారు. కొన్ని ఫిలిములు పెద్ద నటులుండీ కూడా పాడైనై. దానికి కారణం కంపెనీవాళ్లు తమకి యిష్టమొచ్చిన వేషాలు వేయిస్తే వాటికి వాళ్లు తగకపోయినా డబ్బు కక్కూర్తిచే వేయడం మూలాన. పేరుంది గదా అని యడవల్లి సూర్యనారాయణగారిచే సీతాకళ్యాణంలో రాముడి పాత్ర వేయించారు. ఫలితం మనం చూచాం.

ఫిలిములు యితర రాష్ట్రాలలో తీయడం వలన చిన్న వేషాలు వాతావరణానికి గావల్సిన తక్కువ జనం తెలుగువాళ్లు కాక ఏ బెంగాలీ జనమో తయారవడం. ఇటువంటి పరిస్థితులలో తయారయే ఫిలిములు యీవిధంగా గాక తదన్యంగా యెట్లా వుంటై?

వీటి నన్నిటినీ సరియైన మంచి దోవలో గనక దిద్దుకోకపోతే తీయబోయే ఫిలిములకు యిదివరకొచ్చిన లాభాలు రావు. క్రమేణ నష్టాలు కూడా వస్తై. అప్పుడు స్వదేశీఫిలిము లని అభిమానమైనా లేదు మనవాళ్లే కని పరితపిస్తే ఏం లాభముంటుంది కంపెనీవాళ్లు? ఇప్పటికే తెలుగు టాకీల కన్నా హిందీ టాకీలకే యెక్కువ అభిమానం చూపుతున్నారు జనం. ఈతప్పు లన్నిటిని దిద్ది తెలుగు వాళ్లతో కూడుకొని వున్నదని చెప్పబడుతున్న "మద్రాసు వేల్ పిక్చర్సు" వారు తీసే ఫిలిములు నిఖార్సయిన తెలుగు ఫిలిములుగా తయారుచేస్తారని ఆశిస్తున్నా. పరిస్థితులు ఆదే విధంగా వుంటే కాన తెలుగు టాకీల ముందుగతి వేరే చెప్పాలా?

కలియుగధర్మం

"చలం"

కృతయుగంలో ఒకటో పాదంలో దుందుభినామ సంవత్సర కార్తీక శుద్ధత్రయోదశి ఉదయాన సుముహూర్తమందు శౌనకాదిమహర్షులు అందరూ నిత్యకృత్యాలు తీర్చుకుని స్నానాలు చేసి విభూది ధరించి దర్భాసనాల మీద సూతమహర్షి చుట్టూ చేరి కూర్చున్నారు. అప్పుడు శౌనకమహర్షి యేమన్నాడంటే?

"గురువర్యా. కలికాలము, కలికాలము అంటారు. అప్పుడు ధర్మము ఒక పాదం మీదే నడుస్తుందంటారు. ఎంత ఆలోచించినా మాదృష్టికి ఆవిషయం గోచరం కావటం లేదు. అంతు లేనిదీ, ఆత్మానందకర మైనదీ సమస్తసౌభాగ్యకర మైనదీ ఐన యీఆధ్యాత్మికసంపదను వొదిలి ప్రజలు విషయలోలులూ, ధర్మవిచ్ఛేదకులూ ఎలా కాగలరో మామనస్సులకు గోచరము [illegible] మాకు విదిత మయ్యేట్టు బోధ చెయ్యవలె నని కోరుకుంటున్నాము" అన్నారు.

అప్పుడు సూతమహర్షి యేమన్నాడంటే—

"నే నిదివరకు మీకు చెప్పిన దానికన్న యేమి చెప్పగలను! కాని వొకటి చేస్తాను. నాయోగదృష్టివల్ల భవిష్యత్తును చూసి వర్ణిస్తాను. అప్పుడు మీకు ఆవిషయం సులభంగా వ్యక్తమౌతుంది" అని కళ్ళు మూసుకుని యోగనేత్రాన్ని తెరిచాడు. వూపిరి బిగబట్టి తన్మయులై అందరు జడధారులూ ఆయన వదనారవిందము వైపు చూస్తూన్నారు. మెల్లిగా పెదిమలు కదలి యీమాటలు ఆయన వాక్కునించి వినిపించాయి

త్రేతాయుగము — ఊ — ద్వాపరం — ఆ — కలి — మొదటి పాదం. రక్తాక్షినామసంవత్సరం

శ్రావణమాసం — కృష్ణపక్షం — ద్వాదశి — బుధవారం — జంబూద్వీపం — భరతవర్షం — భరతఖండం — కృష్ణాకావేరి మధ్యదేశం — తెనాలి అనే గ్రామం — గ్రామంకాదు — పట్టణంకాదు — ఉదయం — అరుణోదయ మయింది — పట్టణం నిశ్శబ్దంగా ఉన్నది — ఏమి టిది? ఒకరూ లేవలేదు — సంధ్యానుష్టానాదులు లేవు — వేద పాఠం వినపట్టమే లేదు — ఊఁ — ఉత్తరపువేపున ఒక యెట్లో — కొన్ని బోడివి — చీకటి — ఒక యింటిమీద యింకోటి — గృహశాస్త్రనిబంధనలను అన్నిటిని ధ్వంసం చేశారు. ఆమూల దీపం దగ్గిర ఒక వటువు చదువుతున్నాడు — ఏ మంటున్నాడు —

అక్బర్ — వజ్ — ఏ గ్రేట్ రూలర్. అంటే? ఏం భాష అది?

అక్రాడి జుట్టేమటి అట్లా వుంది? ముందు కొంగ్రటుకలూ — వెనక పొట్టీ — ఛీ. ఛీ. దంతధావనమన్నా చేయలేదు. ఉండు. ఏమిటా శబ్దం? ఏదో ఇనపకమ్మలమీద దొర్లుతో పొడుగ్గా రాక్షసివలె నల్లని పొగలు చిమ్ముతో వొస్తోంది. ఏదో పాపం! ఈపట్టణంమీదికి వొచ్చింది. పొడుగ్గా పామువలె వుంది. కీచు మని కూసింది. అంత పెద్ద జంతువుకి అంత సన్నని కంఠ మేమిటి? బ్రహ్మకి ఆనాటికి వెర్రెత్తుతుంది గావును? దాని పొట్టలో మనుషులు. తలలో తోకలో — రామ, రామ, ఎందర్ని మింగిందో! నిప్పులు కక్కుతోంది. ఆ. పొట్టలో తోకలో అన్నీ మంటలే — అరే — మనుషులు బతికే వున్నారయ్యా దానిపొట్టకి కిటికీలు — చూస్తున్నారు బైటికి. ఆగింది — దూకుతున్నారు. పొట్ట చించుకొని దూకుతున్నారు. పెట్టెలు — పరుపులు ఎట్లాంటి మృగం? సాధువు — మచ్చికయింది. పాపం — అరే! అరే! తల వూడి దూరముగా పోతోంది — సామాన్లు పట్టుకొని వొంతెన దాటి పోతున్నారు. అక్కడ రథాలూ — బళ్ళూ — ఇదేమిటి బళ్లు అట్లా వున్నాయి? ఒకడు రథంలో యెక్కుతున్నాడు. వాడి బట్టలు వింతగా వున్నాయి. అన్నీ వేరుగా వున్నాయి. నెత్తిమీద పళ్ళెమంటి తలపాగా పెట్టాడు. మెళ్ళో ఒక పీలికె కట్టుకున్నాడు. రథంలో కూచుని ఒక పెట్టెలోంచి ఒక పుల్ల గీసి అగ్నిని పుట్టించి — నోట్లో అదేమిటి? ఒక గొట్టం దాన్ని వెలిగించి పొగ వొదులుతున్నాడు. ఎందుకు? వీడేకాదు, చాలమందికి వున్నాయి అట్లా. కొందరికి నల్లటి పుల్లలు, కొందరికి తెల్లటివి. అన్నీ కాలుతున్నాయి — పొగలు వొస్తున్నాయి. ఏం ఆచారమో అది? ఆరథం అట్లా వుందే! గుర్రాలు లేవు ఏమీ లేవు — పెద్ద అరుపు అరిచి ఘూర్ణిల్లుతోంది. సాగింది ముందుకు, అరే! అదేదో మృగం భూతం. వెనక ధూమాలు వెదచిమ్ముతోంది. పోయింది. దూరంగా వీధిలో కొందరు ఒక యింటో దూరుతున్నారు. బల్లలమీద గిన్నెలున్నాయి. తింటున్నారు. విస్తళ్ళలో కుడుములు గిన్నెల్లో ఏదో పానీయము — వేడిగా పొగలు వొస్తోంది. తెల్లవారకముందే — స్నానం సంధ్య — కర్మ — అగ్నిహోత్రం ఏమీ లేవే — అబ్రాహ్మలే ఆవొడ్డించేవాళ్లు. అన్నికులాలూ — తింటున్నారు. ఆమ్లేచ్ఛుడు — ఆశూద్రుడు — అందరూ ఒకచోటే ఒక పాత్రలోనే. ఛీ — ఛీ — ఇంక చూస్తే నరకము వస్తుంది పోని —

సాయంకాలం చూద్దాము — ఆ... సాయంత్రం ... పెద్ద వీధిలో గుంపు. ఒకడు ఉపన్యాస మిస్తున్నాడు. చాలా పెద్ద గుంపు — అదేమిటీ? ఇంకో రథం. చాల పెద్దది ఆగింది. గుంపులో కలవరం. గుంపులో చాలమంది ముతకబట్టలు వేసుకున్నారు. తెల్లటి టోపీలు — వీరెవరో యేదో ఆశ్రమంవారేమో? యేదన్నా క్రొత్త మతమో! పాపం పాపం ఆరథంలోంచి ఆయుధపాణులై దిగారు శత్రురాజులేమో! లేక రాజభటులా! కొడుతున్నారు. కర్రలతో మోదుతున్నారు. చాలమంది పరిగెత్తారు; కాని ఆ తెల్లటోపీల వాళ్ళు నుంచునే యున్నారు. రామభజన ఎస్తున్నారు. దెబ్బలు తింటూనే — ఒకడి

చేతులో జెండా వుంది. దాన్ని వొదలడు—హారి హారి! ఎట్టా కొట్టారో! జండా వదలకుండా అట్టానే పడిపోయినాడు కింద. తిరిగికొట్టరే! అయ్యో! యెంత దుర్గతికి వొచ్చారు—క్షాత్రం ఎంత నశించింది! పరసైన్యాలనించి రక్షించుకోరే! భారతి సంతతి యెంత హీనదశకు వచ్చింది! కాదయ్యా! వుండు. కాదయ్యా! లేదు. ఒక్కడూ పరిగెత్తలేదు. రామ! రామ" అంటున్నారు. అకళ్ళల్లో శాంతం దయ ఏమి? భీతి లేదు. ఎంత అహింస! ఎంత క్షమ! అహా! వీరందరూ తాం.సులయ్యా! కలికాలపు ఋషులు, యీ వేషాలలో వున్నారు.

అదుగో సన్యాసి వొస్తున్నాడు ఒకడు. ఇంక యీ యుద్ధాన్ని మాన్పుతాడు. లేదు—ఒక్కడు నమస్కరించడే? తోసేస్తున్నారు. ఏమిటయ్యా యీ కాలం?

కాని యెంత ధర్మం వుందయ్యా? ఒక్క పాద మేమిటి? వర్ణాలు ఆశ్రమములు నశించాయి సర్వకర్మలూ ఆచారాలూ విధ్వంస మైనాయి—కాని యెంత క్షమ! యెంత శాంతం! యీకర్మలు యీకులాలు పోతే నేమయ్యా అట్లాంటి కర్మ యోగు లున్న తరవాత!

టోపీలవాళ్లని లాక్కుపోతున్నారు. మరి వీళ్ళు పరరాజభటు లయితే యీపట్టణమున రాజ భటులు లేరే? కాదు వీళ్ళు రాజభటులు. ఈతెల్ల టోపీల పురుషులు ఈరాజుకు వ్యతిరేక మైన మత ప్రచారం చెయడం చేత వారిని హింసిస్తున్నారు. ఆదండనాధకారి దగ్గిరికి తీసుకు వెళ్ళారు. అటోపీలు లాగేసి పొమ్మన్నాడు. గాయాలు తగిలిన వాళ్ళని తీసుకెళ్ళారు. అది వైద్యాలయం గావును కట్లు కడుతున్నాడు—అక్కడే పడుకో పెట్టాడు ఎంత శుభ్రముగా వున్నదో యీ ఆలయము? ఎన్ని మందులు ఎందరు రోగులో అబ్బా! ఎటువంటి రోగాలో! ఎంత పాపం పెరిగింది! మనుష్యుల్లో ఆచారమూ శుచీ నశించి రోగా లెక్కువైనాయి. ఈపట్టణం యెంత అశుభ్రముగా వుందని; కాని యీ వైద్యు లెంత మంచివాళ్లో! రాజవిరోధుల్ని యెంత ఆదరిస్తున్నారో! పాపం యీరాజభటుల్లో అప్పుడు కొట్టారే గాని యెంత దయగా మాట్లాడుతున్నారు. యెంత మంచి ప్రభుత్వ మయ్యా? మనకాలంలో ఐతే ఒక్క నిమిషములో తలలు తీసేస్తారు కద! విరోధుల్ని కూడా యింత దయగా ఆదరణ చేస్తాడే యీప్రభువు? ధర్మం లేకపోలే దయ్యా!

మిగిలిన తెల్లటోపీల వాళ్ళు యిళ్ళకి పోతున్నారు. రాత్రయింది, దీపాలు వెలిగించారు. తెల్లగా వెన్నముద్దలమల్లే వెలుగుతున్నాయి. ఆదీపాలేమిటి? యెంత వెలుతురో! వీడెవడో నల్లటి వాడు పెద్ద మీసాలవాడు తెల్లటోపీవాడు యిట్టానే వెళ్ళుతున్నాడు యింటికి—చూద్దాం—ఆమె భార్య గావును. పిల్ల నెత్తుకు వొచ్చింది. భర్తకు నమస్కరించనన్నా నమస్కరించదు. భక్తి లేదే! మాటల్లో చూపులలో తృణీకరిస్తోంది. తిడుతోంది. భర్తనే. కొట్టాడు. ఆమెను బైటికి యీడ్చాడు. ఆబిడ్డతో సహా. యిందాక ఆరక్షకభటుల ముందు ఆశాంత మేమిటి? నిజమైన శాంతభావ మబ్బలే దయ్యా! ఆసహన మంతా ఆబహిరంగసభలోనే! ఆ అబలను స్త్రీని ఆశిశువుతో కూడా గెంటి తలుపు వేశాడు. లోపల భోజనం వొడ్డించుకున్నాడు. పాదాలన్నా కడుక్కోలేదు. స్నానం—అర్చనం—అగ్నిపూజ—ధా పాడుగృహాం—ఎక్కడా ఒక దేవతాపట మైనా లేదు. పాప మామె వీధులోనే నిలుచొని యేడుస్తోంది. తోవ బాట్యేవాళ్లు యెవ్వరు విచారించరు. బిడ్డ యేడుస్తోంది. వాడి భోజన మయింది. అంతా అట్లానే వొదిలి తలుపు తీసి వెడుతున్నాడు వీధివెంబడి. పాపం ఆమె భయంతో లోపలకు వచ్చింది. వెదుకుతూంది. బిడ్డకైనా యేమీ లేదు తినడానికి. అంతా తిన్నాడు. పడుకుంటోంది యేడుస్తో. వాడో ఆతెల్లటిపుల్లలు కొని వెలిగించి పొగ వూత్తో పోతున్నాడు—ఇదయ్యా కలియుగం. చాలునా?

ఇనాం దార్లున్నూ

మెడ్రాసు యెస్టేట్సు ల్యాండు ఆక్టు సవరణబిల్లున్నూ

శ్రీ గండికోట సత్యనారాయణమూర్తిగారు. ఎం. ఏ

గతసంవత్సరము ఇనాందార్ల సాగు హక్కులకు నష్టము కలిగేటట్లు మన చెన్నపురి శాసనసభవారు మెడ్రాసు ఎస్టేట్సు ల్యాండాక్టు సవరణచట్టము ప్యాసుచేయగా రాజధాని ఇనాందార్లు పెద్ద ఆందోళనము చేసినందున గవర్నరుగారు ఆస్తులను అపహరించే స్వభావముకల ఈసవరణచట్టము ఇనాందార్లకు నోటీసు లేనిదీ అంగీకరింపబడకూడదు అనిన్ని, ఇనాముల గురించి ప్రత్యేకముగా ఒక బిల్లు కొలది కాలములో పెట్టబడు ననిన్ని చెప్పి అప్పటికి ఆగండము తప్పించేరు. ఈసంవత్సరము జూలై ౧౮ వ తేదీని లోగడ ఇనాందార్లు కూడదన్న శెక్షన్లు కల కొత్త యెస్టేట్సు ల్యాండాక్టు సవరణబిల్లు గవర్నరు జెనరల్గారి అనుమతితో కూడా గెజెటులో ప్రచురణ అయింది. తే ౩౧-౭-౩౮ దీని, ప్రెసిడెన్సీ ఇనాందార్ల గవర్నింగు బాడీ సభ్యులు వేర్వేరు జిల్లాలనుండి రాయబారముగా వెడలి శ్రీ రెవిన్యూ మెంబరయిన సర్. ఆర్చిబాల్డు కేంప్బెల్ దొరగారికి ఈ క్రొత్తబిల్లు వలన ఇనాందార్లకు కలిగే నష్టములను విరివిగా వివరించి చెప్పి, ఇదివరకు ఇనాందార్లు చెన్నపట్నం గవర్నరుగారికి సమర్పించిన వినతిపత్రములోని ముఖ్యాంశము లెత్తి చెప్పి, ఈబిల్లు విషయమై ఏర్పడబోయే శెలక్టు కమిటీలో న్యాయముగా చేయబడవలసిన సవరణలను కొన్నిటిని సూచించి, ఇనాముల విషయమై ప్రతిజిల్లాలోను జిల్లా అధికార్ల మూలమున గాని శెలక్టు కమిటీ సభ్యుల మూలమున గాని క్రమమైన విమర్శనము సాక్షివిచారణ చేయకుండా ఈబిల్లు శాసనసభలో ప్రవేశపెట్ట కూడ దని విన్నవించిరి తే ౨-౯-౩౮ దీని ఈబిల్లు గా॥ రెవెన్యూ మెంబరుగారి వలన ప్రవేశపెట్టబడి ౨౧ మంది సభ్యులు కల శెలక్టుకమిటీకి పంపబడెను. శెలక్టుకమిటీవా రేమో రాజధానియం దంతట ప్రచారము చేసి ఇనాందార్ల వద్ద సాక్ష్యము పుచ్చుకొన రనిన్ని, ప్రత్యేకవిమర్శన మేమీ చేయ రనిన్ని, ఈ రెండు మాసముల లోపుగా ఎవ రైన లిఖితపూర్వక మైన విన్నపములు పంపితే ఆలోచించి త్వరగా వారి నివేదిక తయారుచేసి అక్టోబరు మాసములో శాసనసభలో బిల్లు చర్చకు తిసికొనివచ్చెద రనిన్ని తెలియవచ్చుచున్నది. వ్యవధి విశేషం లేదు. కావున ఇనాందార్లకు ఈకొత్త బిల్లువలన కలిగెడు కష్టనష్టములను, వానిని సంస్కరించవలసిన మార్గములను, వీటినిగురించి ఇనాందార్లు వ్యక్తిగతంగా గాని తమ తాలూకా లేక జిల్లా ఇనాందార్ల సంఘముల మూలముగా గాని, ప్రెసిడెన్సీ ఇనాందార్ల సంఘము శెక్రెటరీగారికిన్ని ప్రధానమంత్రి శ్రీ బొబ్బిలి రాజావారికిన్ని, ఎస్టేట్సులాండాక్టు రెండవ సవరణబిల్లు శెలక్టుకమిటీ శెక్రెటరి గారికిన్ని (ఈముగ్గురి విలాసము చెన్నపట్నమే) లిఖితరూపక మైన విన్నపములను అతి త్వరగా పంపవలె నని ఇనాందార్లను హెచ్చరిస్తూ ఏతద్విషయమై నా అభిప్రాయములు సలహాలు కొన్నిటి నిదిగువ పొందుపరుస్తున్నాను:—

ఎస్టేట్సులాండాక్టు ౩ వ సెక్షను క్లాజు ౨ (డీ) కి బదులుగా క్రొత్తబిల్లులో పేర్కొనబడిన "ఎస్టేటు" పదనిర్వచనము అసలులోనికి వస్తే ఇనాందార్లకు చిరకాలానుభవ మైన సాగుహక్కు లేక కుడివరము హక్కు అంతరిస్తుంది. అది శాశ్వతముగా ఇనాంభూమి సాగుచేసే రైతువానికి వస్తుంది; అంటే ఇనాందారుని ఇష్టము లేకుండా రైతువాడు ఇనాం భూమిని జమీందారీ జిరాయితీ

భూమి లాగున అమ్మివేయవచ్చును. తణకా పెట్టవచ్చును. ఇతరత్రా అన్యాక్రాంతము చెసుకొనవచ్చును. ఇనాందారునకు మేల్వారము లేక శిస్తు పుచ్చుకొనే హక్కు మాత్రం ఉంటుంది. ఆహక్కు ఇనాందారుడు అమ్మినా కుడివరము హక్కునకు వచ్చే ఖరీదు రాదు. రూ ౩౦౦౦ లు ఖరీదు చేసే ఇనాంభూమి ఇక మీదట ఇనాందారుడు అమ్మితే సుమారు రూ౧౦౦౦లు మాత్రమే వస్తాయి. ఇనాం రైతు వాడు అమ్మితే సుమారు రూ౨౦౦౦లు వస్తాయి. లేకపోతే సుమారు రూ ౧౨౦౦లు ఇనాందారునకున్ను రూ ౧౮౦౦ లు రైతువానికిన్ని రావచ్చును. మేల్వారము, కుడివరము హక్కులకు అంత వ్యత్యాసముంది. ౫౦ మెద్రాసు ౪౦౩ తీర్పు ప్రకారము మన చెన్నపట్నం హైకోర్టువారు కుడివరముదారునికి ౩ వంతులలో ౨ వంతులున్న మేల్వారముదారునికి ౩ వంతులలో ౧ వంతున్ను పరిహారము ముట్టచెప్పేరు; ౩౩ మెద్రాసు ౩౯౫ తీర్పు ప్రకారము కుడివరందారునికి ౫ వంతులలో ౩ వంతులున్ను మేల్వారందారునికి ౫ వంతులలో ౨ వంతులున్ను ముట్టచెప్పేరట. నా ఉదాహరణమునకు ఈ హైకోర్టు తీర్పుల సూత్రము ఒక విధముగు ప్రమాణము. ఈ బిల్లు ముందు ప్రొసపుతుందన్న రూమరు వల్లనే అప్పుడే ఇనాంభూముల వెలలు మందగించాయి. ఇంకా మందగిస్తాయి; ఇనాందార్లు ఇనాంభూములు కొనుక్కొన్నప్పుడు ఈ హక్కులు తమకు ఉంటాయన్న నమ్మకముతో కొనుక్కొన్నారు కదా! ఇప్పుడు కొత్త పద్ధతి పెట్టి వారి కొంప తియ్యడం న్యాయం గాదు. ఇంతేకూ, నష్టపరిహారము ఇవ్వకుండా ఆస్తులను అపహరింపవచ్చునా? గవర్నమెంటువారు హక్కులను ఆస్తులను తప్పక కాపాడువారు అనే సామాన్యపు నమ్మకమునకు ఈబిల్లు భంగము కాదూ! తప్పనిసరిగా ఈకొత్తబిల్లు చట్టము కావలెనంటే ఇనాందారునకు భూమివలన వచ్చే భాగమునకు ౨౦ ఇంతలో ౩౦ యింతలో నష్టపరిహారము వచ్చేటట్టు చట్టదిట్టము చేస్తే గుడ్డిలో మెల్ల అనునట్లు ఒకలాగున ఉంటుంది. అట్టి చట్టదిట్టము కష్టము అయితే పూర్వము లాగునే ఎస్టేటు అనే పదమునకు వ్యాఖ్యానం ఉంచండి; ఇనాములు "యెస్టేట్లు" అయేటట్టు సవరణ పెట్టకండి.

(౨) ఇనాముభూముల గురించి దావాలు వస్తే ఆభూకామందుకు మేల్వారము కుడివరము హక్కులు రెండున్నూ ఉన్నాయా లేక ఒక్క మేల్వారము హక్కు మాత్రము ఉన్నదా? అనే సారాంశము విశదపరచవలసివచ్చేటప్పుడు భూమియందు కుడివరం హక్కు వున్నదని రుజువు చేయవలసిన భారము రైతువానిదని మన హైకోర్టువారు కొన్ని తీర్పులు చేసి యుండిరి; కొన్ని దావాలు ప్రివీ కౌన్సిలు వరకు వెళ్ళినప్పుడు అట్టి రుజువు భారము భూకామందుయందు గాని, రైతువానియందు గాని ఉన్నదని ఖచితముగా తీర్మానించుటకు వీలులేదనిన్ని ఆయా దావాల వివరణాంశములను అనుసరించే తీర్మానింపబడవలె ననిన్ని కొన్ని తీర్పులు చెప్పేరు. భాగ్యవంతుడగు ఇనాందారునితో, బీదవాడగు రైతు పోరాడలేక నష్టపోతున్నాడని ఈకొత్తబిల్లు పెట్టవలసివచ్చిందని కొందరంటున్నారు. అదే కొత్తబిల్లుయొక్క వాస్తవోద్దేశమైతే, అట్టి తగాయిదాలు వచ్చినప్పుడు రుజువు భారము కొన్నికొన్ని అవస్థలలో ఇనాందారునియందున్ను మరికొన్ని అవస్థలలో రైతువానియందున్ను ఉండవలసిందని న్యాయవిశారదులగు మన శాసనసభవారు ఒక ప్రత్యేకసవరణ చేస్తే ఈఅందోళనమే ఉండదే! శెలక్టు కమిటీలో వున్న న్యాయశాస్త్రజ్ఞులు ఈవిషయమై ఉభయవాదులకు అంతగా నష్టము లేని సవరణ ఒకటి కల్పించి పూర్వపు ఆక్టులో వున్న "ఎస్టేటు" పదవ్యాఖ్యానము మార్పు లేకుండా ఉంచితే తగాయిదాలన్నీ అంతరిస్తాయి.

(౩) ఇనాందార్లను జమీందార్లతో సమానం చేసేఉద్దేశముతో ఈకొత్తబిల్లు పెట్టవలసివచ్చిందని

కొందరంటున్నారు. ఇదెక్కడి మాట! ఈసామ్యము కుదరదు. చరిత్రాత్మకముగా చూచినా అర్థికరీత్యా చూచినా న్యాయరీత్యా చూచినా వారి అంతస్థులు సంస్థలు వేర్వేరు. పెద్ద జమీందారీ భూముల విషయమై నిర్మింపబడ్డ చట్టము అల్ప భూస్వాములైన ఇనాందార్ల విషయంలో వర్తించేటట్టు చెయ్యబూనడము సాహసము. "ల్యాండు సిష్టమ్సు ఆఫ్ బ్రిటిషిండియా" అనే గ్రంథరాజము ౪వ సంపుటములో బేడన్ పవల్ దొరగారు "జమీందారీ ఎస్టేట్లలో ఇనాములు చేర వని" స్పష్టముగా వ్రాసేరు. ౧౯౦౮ లో ఎస్టేట్సు ల్యాండాక్టు ప్యాసైనప్పుడు ఈ ఇనాముల విషయమై చర్చ జరిగింది. అప్పుడు బి. యన్. శర్మగారు, వి. కృష్ణస్వామి అయ్యరు గారు, జి. ఫోర్బ్సు దొర గారు మేల్వారము కుడివరము హక్కులు రెండున్న కల ఇనాం భూములు ఎస్టేట్లగా పరిగణించబడ కూడ దని తీర్మానించి ౧౯౦౮వ సంవత్సరపు ౧వ ఆక్టు ౩వ సెక్షను ౨వ క్లాజు (డీ) ఏర్పరచేరు. వారి ఉద్దేశాలవి కావు సంగతి సందర్భాలు వేరు అని వాదించే వారు అప్పటి శాసనసభ ప్రొసీడింగ్సు జాగ్రత్తగా చదవవలసి ఉంటుంది. ఏ యినాం భూముల విషయములో ఒక్క మేల్వారము హక్కు మాత్రము ఇనాందారునకు యివ్వబడెనో ఆభూములను "ఎస్టేట్లు" అనియే వ్యవహరించవచ్చును. ప్రస్తుతము అమలులో వున్న పద్ధతియే యిది. ఇనాం కమిషన్ వారు ఇనాందారునకు ఒక్క మేల్వారం హక్కు వున్నదా లేక మేల్వారం కుడివరం హక్కులు రెండూ ఉన్నాయా అనే సమస్య తీర్మానించలేదు. న్యాయస్థానములలోనే అది తీర్మానింపబడవలె నని అభిప్రాయపడ్డారు.

౪ "ఇనాం భూములను దున్ని సాగు చేసే రైతువానికే భూమి హక్కు ఉండాలి గాని ఇనాందారునకు హక్కు లేదు; పూర్వపు పద్ధతి యిలాగే వుండేది; ధనవంతులు బలవంతులు అయిన ఇనాందార్లు ఈ హక్కు తమ దని చెప్ప ఇటీవల అన్యాయముగా ఆక్రమించుకొన్నారు; ఇనాం రైతు నాయకులము మే మిప్పుడు బయలుదేరి చట్టరూపకముగా కుడివరం హక్కు రైతువానికిప్పిస్తాము" ని ప్రగల్భాలు పలికే జస్టిసు పక్ష నాయకుల వాదము నిరాధారమైనది; అన్యాయవాదము; చరిత్రాత్మక సాక్ష్యములకు విరుద్ధము. గతసంవత్సరము వరకు, అనగా ఎస్టేట్సు ల్యాండాక్టు ప్యాసుకాబడిన ౧౯౦౮ లో గాని తరువాత సవరణబిల్లులు ఉపపాదింపబడినప్పుడు గాని ఈఅసందర్భవాదము లేనే లేదు. జమీందార్లకు ౧౯౦౮ వ సంవత్సరపు ౧వ ఆక్టు ప్రకారము జమీందారీ జిరాయితీ భూముల విషయములో అదివరకు రైతులకు ఉండియున్న సాగుహక్కులు చట్టదిట్టము అయినాయి. ఇనాముల విషయమై ౧౯౦౮ కి తత్పూర్వము గాని తదనంతరము గాని ఇనాం రైతుకు సాగు హక్కు అసలే లేదే? అట్టి సందర్భములో ఇట్టి విచిత్రపు వాదము చేయడము చాలా శోచనీయముగా వుంది. కొన్ని జమీందారీలలో జిరాయితీ రైతుల పట్ల జమీందార్లు చేయుచున్న అత్యాచారములను బయటపెట్టి కొందరు ఇనాందార్లు ఆందోళన చేస్తున్నారు; కావున, ఇనాందార్ల కొంప తీసి వాళ్ల సాగుహక్కులు నాశనము చేసి పగ తీర్చుకొందా మని శాసనసభలో పలుకుబడిన్ని తాత్కాలికపు మెజారిటీయున్నూ కల జమీందార్ల పన్నగడ ఫలితమే ఈబిల్లు; ఈజమీందారులలో కూడ కొందరికి ఇనాం గ్రామాలు ఉన్నాయి; ఇనాముల విషయము వచ్చే నష్టము భరించి అయినా ఈబిల్లు ప్యాసు చేయించా అని సంకల్పించుకున్నట్టు కానవస్తుంది.

౫ "ఈసవరణబిల్లు ప్యాసయితే ఇనాందారునకు వచ్చే నష్ట మేమి లేదు; సాగు హక్కు రైతువానికి వచ్చినా ఫరవాలేదు: ఇప్పటి లాగే ఇనాందారు ఎవడు రైతయితే వానివద్ద భూమి పంటలో

ని భాగము పుచ్చుకోవచ్చును గదా" అనే వాదన కొందరు చేస్తారు. ఈవాదనలో చాలా ప్రమాదాలున్నాయి : గమనించండి:—

ప్రస్తుతము కౌలు ముచ్చిలకౌలలోని కాంట్రాక్టు షరతుల ప్రకారము ఇనాందారునకున్నూ వాని రైతునకున్నూ ఉన్న సంబంధము అంతరించిపోతుంది. షరతాఖరున భూమి వదలివేయాలి అనే నిబంధన ఇక మీదట రైతువానికి వర్తించదు. రైతు 'నాదే భూమి' అంటాడు: శాశ్వతమైన సాగు హక్కు నాకు వచ్చిందంటాడు; అంచనా లేక కైలుపద్ధతిని రైతువాడిక మీదట ఫలసాయము భుక్తకివ్వడు; దరిని యున్న జిరాయితీ భూముల పద్ధతియే కావాలి అంటాడు; మాన్యాలు మీ వని అనుకోండి గాని ధాన్యాలు మావే అనిన్ని ముండభరణం లాగు నగదుశిస్తులు జిరాయితీ భూములలో లాగు "రికార్డాఫ్ రైట్సు, శెటిల్మెంటు" ప్రకారమే కడతామనిన్ని ఇనాంరైతులిక మీదట అగ్రహారం భుక్తలతో వాదిస్తారు. ఇదంతా యినాందార్ల కెంత నష్టమో ఊహించుకోవాలి గాని వ్రాయడానికి అలవి కాదు. ఈసందర్భములో శెలెక్టుకమిటీవారికి మనవి చేసిన దేమంటే ఈబిల్లు తప్పని సరి అయితే ఇప్పటి లాగున కౌలు ముచ్చిలకౌల కాంట్రాక్టు షరతుల ప్రకారము రైతువల్ల ధాన్యరూపకమైన భాగాలు చెలామణీ అవాలి అనే సవరణ అయినా చెయ్యండి.

(౬) "శిస్తులు వసూలు చేయుటకు ల్యాండాక్టు ప్రకారము జమీందారునకు ఉన్న అధికారాలు (అనగా, రెవిన్యూకోర్టులో దావా చేసి రైతువాని భూమి అమ్మించుట. రైతువాని చరాస్తి జప్తు చేయించి అమ్మించుట) ఇనాందారునకు కూడా వస్తాయి మంచిది కాదా" అని అంటారు కొందరు. ఎక్కువ భూములు, పెద్ద సిబ్బందీ, ఉద్యోగ వర్గము, పలుకుబడి కలిగివున్న జమీందారునకే ఈ అధికారాలు సరిగా చెలాయించడము ఎంతో కష్టంగా ఉంది; అల్పభూస్వామి అయిన ఇనాందారుడీ అధికారాలు చెలాయించలేడు. ప్రస్తుతం ఇనాందారునకు రైతునకు ఉన్న స్నేహభావాలు అంతరించి వైషమ్యాలు రెవిన్యూదావాలు పెరుగుతాయి. శివిల్కోర్టులలో వలె రెవిన్యూకోర్టులలో క్రమమైన న్యాయబద్ధమగు విచారణ ఉండదు. ఎక్సపార్టీ సమ్మరీ డిక్రీలు. వాటి అమలు సందర్భంలో దెబ్బలాటలు, ఆపైని క్రిమినల్ దావాలు— ఇవి జాస్తీ కాక మానవు.

(౭) మేల్వారము కుడివరము హక్కులు రెండున్ను ఉంటాయనే సంపూర్ణనమ్మకముతో బోలెడు డబ్బు పోసి ఇనాం భూములు కొనుక్కున్న వాళ్ళు, తణఖాలు పట్టిన వాళ్ళు, ఇప్పుడా యినాంభూముల గురించి దావాలు తంటాలు శివిల్కోర్టులలో పడుతూ ఉన్నవాళ్లు—ఈకొత్త బిల్లు అమలులోనికి వస్తే వీళ్లకి చాలా నష్టం వస్తుంది. వీరి హక్కులకు భంగము రాకుండా శెలక్టుకమిటీవారు చట్టదిట్టం చెయ్యాలి.

(౮) ఈబిల్లు ఆక్టు కాగానే భూమిని సాగు చేయించుకొని ఇరువాయం అనుభవించగల అధికారము చాలా మంది ఇనాందార్లకు పోతుంది. నిరుద్యోగసమస్య ఆర్థికమాంద్యము జాస్తీగా వున్న ఈరోజులలో ఇట్టి బిల్లు వెంటనే అమలులోనికి వస్తే చాలామంది ఇనాందార్లు దివాలా తీస్తారు. ఈబిల్లే తప్పని సరి అయితే, "మలబారు టెనెన్సీలా"లో వున్నట్లు కొన్ని చట్టదిట్టాలు చేసి ౧౨ సంవత్సరాల తరవాత ఈబిల్లు అమలు అయేటట్లు సవరణ పెట్టాలి.

(౯) ఎంతో ధనవ్యయం చేసి శివిల్కోర్టులలో ఈభూములు "ఎస్టేట్లు" కావు, రైతులకు కుడివరం హక్కులు లేవు అని తీర్పులు పొందిన ఇనాం భూముల విషయంలో ఈసవరణ చట్టం వర్తించకూడదన్న నిబంధన సెలక్టుకమిటీవారు పెట్టాలి. కొంతమంది ఇనాందార్లు ప్రివీకౌన్సిల్ వరకు వెళ్ళి

తీర్పులు సంపాదించేరా. అఫలిత మంతా ఈసవరణ బిల్లు మూలంగా పోగొట్టుట పాడి గాదు.

(౧౦) "ఇనాందార్లు ఇనాం రైతులను చాలా బాధిస్తున్నారు: దానిసల కిన్న కనకిష్టంగా వుంది ఇనాం రైతుల గతి. ఈబిల్లు ద్వారా ఇనాం రైతులకు ఆర్థికవిమోచనము కలిగిస్తా మన్నే కొందరి శాసనసభ్యుల వాదన నిరాధార మైనది. తగిన ఆర్థిక విమర్శన చేసి ఇట్టి అభిప్రాయాలు తేలిస్తే బాగుంటుంది గాని వట్టి కబుర్లు చెప్పడం న్యాయం కాదు. మొన్న మనశాసనసభలో జస్టిసుపక్షం ఆయన ఒక రన్నారూ "......మన ప్రభుత్వాబ్ద మునందు ప్రమాణము గా దనియు, మనుస్మృతి ననుసరించినచో శ్రీవెంకట్రామయ్యగారు గారు (వీరు ఇనాందార్ల పక్షము మాట్లాడిన శాసనసభ్యుడు) పురోహితుడై యుండవలసినదే గాని ప్లీడరై శాసన సభలో ఉండరాదు.. ..." ఈ పెద్దమాటలు చెప్పిన ఆయన వంశం వారు మొదట ఇనాంభూములు సాగుచేసే వారే; ఇప్పు డేల ప్లీడరై శాసనసభలో నికి వచ్చేరో! ఇనాందార్ల బాగసత్వము పదా లేకనా! తామూ ఇనాందార్లే! ఈమధ్య ఇలాంటి సవరణబిల్లు శాసనసభలో చర్చించబడ్డప్పుడు, ఒక సభ్యు డీ దిగువ ప్రశ్నలకు గవర్నమెంటువారిని జవాబు చెప్ప మని కోరేడు:—

ల్యాండాక్టు ౩ వ శెక్షన్ క్రింద వచ్చే ఇనాం భూములు కల గ్రామాల జాబితా యేదీ? ఏయే యినాంగ్రామాలలో భూము లన్ని పంపకము అయినాయి? ఎన్ని యినాం గ్రామాలలో ౧౦ మం దికి మించిన అంశమంతులు వున్నారు? ఒక్కొక్కరికి ఎంత విస్తీర్ణం గల భూమి ఉందీ? మేల్వారము కుడివరము రెండు హక్కులూ కల ఇనాందార్లెందరున్నారు? ఏయే యినాం గ్రామాల విషయంలో ఇనాందారునకు కుడివరం హక్కు వున్నట్లు యిదివరకు కోర్టు తీర్పు లైనాయి? ౧౯౦౭ కి పూర్వము ౧౯౦౭ కి తదనంతరము ఎన్ని యినాం గ్రామాలు గాని గ్రామభాగాలు గాని క్రయులబ్ధమై వున్నాయి? ఇనాందారునకు రైతునకు కల ఆర్థిక సంబంధ మేలా వుంది? జిరాయితీ రైతునకు జమీందార్లునకు కల సంబంధానికి దీనికి తేడా యేలాగున వుందీ?—ఇట్టి ప్రశ్నలకు ఉత్తరములు చెప్పటకు కావలసిన భోగట్టా నావద్ద లే దని గా॥ రెవెన్యూ మెంబరుగారే ఒప్పుకున్నారు. మొన్న ౩౧-౬-౩౮ వ తేదీని నేనూ మరికొందరున్నూ రాయబారముగా వెళ్ళి ఇనాముల సమస్యను గురించి గా॥ రెవెన్యూ మెంబరు గారితో సంప్రతించినప్పుడు కూడా ఇనాముల గురించి ఆర్థికవిమర్శనము చేయించం డని కోరేము. ఆలోచిస్తా మన్నారు. ఇప్పు డేనా మీది ప్రశ్నలకు జవాబులు చెప్పడానికి కావలసిన భోగట్టా అంతా సంపాదించేరో లేదో తెలియదు. ౨-౭-౩౮ తేదీని ఈసవరణ బిల్లు గురించి మాట్లాడుతూ ఒక శాసనసభ్యు డన్నాడూ—ఇలాంటి భోగట్టా ఇనాందార్లే సంపాదించా లని. మంచి మాటే గాని చిక్కు ఎలా వుందంటే—కావలసిన భోగట్టా లేకుండానే, ఈవిపరీతపు చట్టం ప్యాసు చెయ్యడానికి ఆలోచిస్తున్నవారూ శాసనసభ్యులే. మీరు విమర్శనము చెయ్యండి మాకు తోచిన సాయము మేము చేస్తా మని ఇనాందార్లు అంటే విమర్శన చెయ్యడానికి వారికే బద్ధకమో తీరుబడి లేదో. శెలక్టుకమిటీవారైనా రాజధానియందంతటా ప్రచారం చేసియో, లేక, జిల్లాకలక్టర్లు తహశీల్దార్లు మొదలైన రివిన్యూ అధికార్లకు వ్రాశియో మీది ప్రశ్నలకు సరియైన జవాబులు లెక్కలతో సహా సంపాదించి సంగతి సందర్భాలు బాగా ఆలోచించి వారి సలహాలు శాసనసభవారికి నివేదించవలసి వుంటుంది. తగిన విమర్శన చెయ్యకుండా వట్టి దురభిప్రాయాలు మనసులో పెట్టుకొని ఈ అసందర్భపు ఇనాముల బిల్లు ప్యాసుచేయకం డని శాసనసభ్యులను కోరుతున్నాను.

(౧౧) ౧౯౦౮ వ సంవత్సరపు ౧ వ ఆక్టు ౧౮౫ వ శెక్షనుకు "ప్రయివేటు ల్యాండు" విషయంలో ఈకొత్త బిల్లులో చేయబడిన సవరణ అన్యాయమైనది. ౧౯౦౮ వ సంవత్సరమునకు పూర్వము ఇనాందారులు "ప్రయివేటు ల్యాండు"గా కౌలు కిచ్చిన భూమి ఇనాందారుని భూమిగా పరిగణింపబడు నని సదరు సవరణ యొక్క భావము, అయితే దీనిలో చాలా అసందర్భం వుంది: "ప్రయివేటు ల్యాండు" అనే మాటల పోగు "జిరాయితీ ల్యాండు" నకు వ్యతిరేకంగా ల్యాండాక్టులో వాడబడుతూ వచ్చింది. అట్టి విచక్షణ ఇనాం భూములకు వర్తించదు. మేల్వారము కుడివరము హక్కులు రెండు కల ఇనాం భూమి యావత్తూ ఇనాందారుని స్వంత ఆస్థియే. దానిని "ప్రయివేటు ప్రాపర్టీ" అనాలి. ఈసవరణ పూర్తిగా సంస్కరించి "ప్రయివేటు ల్యాండు" నిర్వచనము సరిగా పూర్వమువలె శెలక్టు కమిటీవారు చెయ్యాలి.

(౧౨) భూమిని సాగుచేసే వ్యవసాయదారునకే సాగు హక్కు లేక కుడివారం హక్కు వుండాలి; చాలా మంది ఇనాందార్లు రైతులచేత తమ భూములు సాగుచేయిస్తున్నారు కాబట్టి కుడివరం హక్కులు ఇనాం రైతులకే చెందజేయవలసింది; ఈ విషయంలో రైతు లందరూ ఇనాం రైతుల పక్షం వుండి ఆందోళన చెయ్యాలి" అని కొందరు రైతునాయకులు ప్రబోధము చేస్తున్నారు. ఈవాదన లోని అసందర్భము కొంచెం జాగ్రతగా చూస్తే విశద మవుతుంది.— జిరాయితీ రైతులలో కూడా కొంతమంది భూమి స్వయంగా సాగుచేయక వేరే రైతులను నియమించి సాగుచేయించుకుంటున్నారు. ఈమీది సూత్రము జిరాయితీ రైతుల క్రింద భూమిని సాగు చేసే రైతులకు కూడా వర్తించడం న్యాయం కదా! అంటే, జిరాయితీ రైతులకు కుడివరం హక్కులు పోయి వాళ్ల చేతిక్రింద వున్న కొనే రైతులకు సంక్రమించాలి. ఈరైతు నాయకుల మాటలు విని తమ సాగుహక్కులను నష్టపరచుకొనుటకు ఒప్పుకునే జిరాయితీ రైతు లెంతమంది వుంటారో చెప్పడం కష్టము! ఎవ్వరూ బుద్ధిమంతులైతే ఉండ రనే చెప్పగలను. అయితే, రైతునాయకు లిప్పుడు జిరాయితీ రైతుల సాయంతో ఆందోళన చేసి మొదట ఇనాందార్ల సాగు హక్కులు తీయించి వేసి తరువాత తమకు సాయం చేసిన జిరాయితీ రైతుల సాగు హక్కులు ఊడ బీకిస్తారు కాబోలు! ఈనాయకులు చెప్పే సూత్ర స్వభావము పాపం జిరాయితీ రైతులు గ్రహించక పోవడము వారి దౌర్భాగ్య మనే చెప్పవచ్చును. మాటవరుసకు, జిరాయితీ రైతులకు కూడా కుడివరం హక్కులు పోయి వారి చేతిక్రింద వుండి దున్నుకునే రైతులకు వస్తవి అనుకుందాము. అప్పట్లో, జిరాయితీ రైతులకు మేల్వారం హక్కైనా యిస్తారా? లేక ఏహక్కూ యివ్వరా? న్యాయ రీత్యా కుడివరం హక్కు పోయినప్పుడు, మేల్వారం హక్కైనా ఇవ్వాలి. జిరాయితీ రైతులకు మేల్వారమూ, వారి చేతిక్రింద సాగు చేసే రైతులకు కుడివరం హక్కూ వస్తే జమీందారుని కేమి ఉంటుంది? ఈజమీందార్ల సంస్థకే స్వస్తి చెప్పించేసి వారికి మన రైతునాయకులు పింఛన్లు "రికమెండు" చేస్తారా యేమిటి? ఇంతకూ, ప్రస్తుతపు శాసనసభలో పలుకుబడి కల జమీందార్లు ఒప్పుకుంటారా ఈ న్యాయానికి? ఇక రైత్వారీ భూస్వాముల క్రింద భూమి కొన్ని సాగు చేసే రైతులకు కూడా పై సూత్రాన్ని బట్టి కుడివరం హక్కు వస్తుంది; గవర్నమెంటుకు ఉన్న మేల్వారం హక్కైనా రైతు భూస్వామి కిస్తారా? లేక వంతులు వేసుకుంటారా? దేశాన్ని ఏలే గవర్నమెంటుకు ఏహక్కూ యివ్వకుండా వ్యాఖ్యానాలు చేసారా? "స్టేట్", అనగా దేశాన్ని ఏలే గవ

ర్నమెంటు. దానికి ప్రథమతః భూస్వామిత్వం వర్తింపచేసి ఆపైని తతిమ్మా మాటలు చెప్పాలి. ఇదే "స్టేటులాండులార్డిజం" సిద్ధాంతము. మన రైతునాయకులు చెప్పిన సూత్రాలు జపించవచ్చును గాని అమలులో పెడితే అల్లకల్లోలం, కలవరం, విప్లవం దేశంలో పుట్టక మానదు. ఇంతేకాక, ఈ ఇనాముల బిల్లు ఆక్టు అయితే ఇనాందార్ల ఆస్తులు హక్కులు నశిస్తాయి; ఒకనికి వున్న ఆస్తియందు కల హక్కు కొత్త చట్టం పెట్టి గవర్నమెంటు భంగ పెడితే, గవర్నమెంటు వారి యందు ప్రజలకు వుండే నమ్మకము, విశ్వాసము క్షీణించదూ! ఇట్టి రాజకీయసమస్యలు, రాబోయే క్లిష్టపరిస్థితులూ అన్నీ రాజ్యాంగవేత్తలైన మనశాసనసభవారు ఆలోచించాలి.

హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం

దీన్ని గురించిన లేఖలు శరపరంపరగా వస్తున్నాయి. ఇందులో కొన్ని మాత్రమే ప్రకటించగలిగాము. చాలా పత్రికలు కూడా మా వాదాన్ని బలపరుస్తూ సంపాదకీయాలు ప్రకటించాయి. ఆంధ్రపత్రిక కూడా యీ విషయాన్ని తాకింది; గాని చాలా మృదుభావంగా మాట్లాడింది. పత్రికా సంపాదకీయాలు కూడా కొన్ని యిక్కడ చూపిస్తున్నాము. తక్కినవి క్రమంగా ప్రకటిస్తాము. గృహలక్ష్మి మావాదాన్నంగీకరించిందనే చెప్పవచ్చు; అయితే ఆమె హిందీ వ్యాపనంవల్ల తెనుక్కి నష్టం లేదంటుంది. మేము తెనుగుభాషని ప్రచారకులు తొక్కేయ్యాలని చూస్తున్నారన్నాము; గాని హిందీ తొక్కేస్తోందనలేదు. జూలై సంచికలో మేము ప్రచారకుల దృఢసంకల్పాలను చూపే వున్నాము. హిందీ మనం నేర్చుకోవాలంటే సరే; కాని అది బజారుభాషగా మాత్రమే వుండాలి. తెనుగు యిళ్లల్లో దానికి ప్రవేశం వుండడానికి వీలు లేదు. ఆ కొంచెం ప్రయోజనం కోసం యింత ఆడావడి యెందుకూ? జిల్లా కొక హిందీప్రచారకసభని యేర్పరిచినా—రాత్రింబగళ్లు యెడతెరిపి లేకుండా పని చేసినా ఇంగ్లీషు వడి మళ్లీ దాకా హిందీ యీప్రాంతంలో వినోదానికే వుపకరిస్తుంది. ఇంగ్లీషు వ్యాపకాన్నయినా యీ హిందీ తగ్గించలేదు. ఇక వున్న దల్లా యేమిటంటే? వొక కారణంవల్ల హిందూస్థానీలు తమ హిందీని గురించి యింత శ్రద్ధా, తహతహా చూపిస్తున్నారు. "హిందూదేశానికి సామాన్యభాష యేది? దానికి వాడవలసిన లిపి యేమిటి?" ఇదీ అసలు ప్రశ్న. మాహమ్మదీయులు తమ ఉర్దూభాషే సామాన్య భాషగా వుండాలంటున్నారు. దానికి పార్శీలిపే వాడాలంటున్నారు. హిందీని, దేవనాగరిలిపిని వారెప్పుడూ వొప్పుకోలేదు. కాకినాడ నగరంలో కాంగ్రెస్సు సమావేశానికి వొకటి రెండు రోజులు వెనక జరిగిన హిందీసాహిత్య పరిషత్తుయొక్క అవసర సమావేశంలో డాక్టరు కిచ్లూ, మౌలానా మాహమ్మదాలీ ప్రభృతి మాహమ్మదీయులు ఉర్దూపక్షంగా చాలా పట్టుపట్టారు. నెహ్రూకుటుంబం కూడా ఆవాదాన్నంగీకరించింది. చివరికి అదే నెగ్గింది. తదనుగుణంగా కాంగ్రెస్సులో నెహ్రూద్వయమూ, సరోజనిదేవి కూడా శుద్ధ ఉర్దూలోనే మాట్లాడారు. కిచ్లూగారు ఇంగ్లీషూ హిందీ వొక్క ముక్కయినా ఉచ్చరించలేదు. మాహమ్మదాలీ గారూ, షౌకతాలీ గారూ ఇంగ్లీషు ఉర్దూలలో మాట్లాడారు. ఇది యిలా వుండగా అలహాబాదు, లక్నో, కాన్పూరు మొదలైన శుద్ధ హిందూస్థాని నగరాల్లో కూడా కోర్టుభాష ఉర్దూ కాని హిందీ కాదు డిల్లీప్రాంతంలోనూ అంతే. పంజాబులో కూడా అంతే అని తెలుస్తోంది.

పులిమీద పుట్ర అన్నట్టు హైదరాబాదురాజ్యంలో వొక స్వతంత్రవిశ్వవిద్యాలయం తన వ్యవహారం అంతా కేవలమూ వుర్దూలో నడిపిస్తోంది. ఇలాగ ఉర్దూకీ, హిందీకీ నువ్వా నేనా అని దారుణమైన పోటీ వచ్చింది. ఈ స్థితిలో దక్షిణభారతదేశాన్ని తాము ఆక్రమిస్తే తమ హిందీకి బలం వస్తుందని హిందూస్థానీలు యీ మోతు యెత్తారు. కాంగ్రెస్సు హిందీని సామాన్యభాషగా వాడాలంటోందంటే దాని వుద్దేశం వేరు. కానైతే అరబ్బీ, పార్సీ మిళితమైన వుర్దూ కంటే సంస్కృతమిళితమైన హిందీయే మనకి సులభసాధ్యం అవుతుంది; గాని హిందూస్థానీల ప్రయత్నం యెందుకో తెలుసుకోకుండా మనకీ కంగారెందుకూ? స్వరాజ్యం వచ్చి, అది హిందీనే అంగీకరించినా యీ దక్షిణప్రాంతాలలో యెక్కడా అది కోర్టుభాషగా వుండదు. శాసనసభలలో కూడా దానికి ప్రవేశం వుండదు. ఏప్రాంతాని కాప్రాంతపు భాషలోనే సర్వవ్యవహారాలూ నడుస్తాయి. వొక్క అఖిలభారత వ్యవహారాలకు సంబంధించినంతవరకే సామాన్యభాష వాడబడుతుంది. అప్పుడు కాంగ్రెస్సు కేంద్రప్రభుత్వసంస్థ అయిపోతుంది. కనక దాని వ్యవహారాలు సైతం ఆసామాన్య భాషలోనే నడుస్తాయి. ఇలాగ యేది సామాన్యభాష అయినా పరిపాలనాధికారం మనకి స్వాధీనమయ్యేదాకా మన సామాన్య భాషకి ఉండవలసిన దానికంటే చాలా తక్కువ ప్రచారం మాత్రమే వుంటుంది. కాంగ్రెస్సు వ్యవహారాలు ఇప్పుడు కూడా కేవలమూ హిందీలో జరగడానికి వీలులేదు. ఇంగ్లీషే అక్కడ ప్రాధాన్యం వహించి వుంటుంది. ఇన్ని సంగతులుండగా మా ఆంధ్రసోదరులు దుడుంగు మంటే గేలం వేసి యిలాగ హిందీని పట్టుకుని పాకులాడడం ఆత్మహత్య తప్ప మరేమీ కాదు.

(సంపాదకుడు)

౧

"అయ్యా, ఆగస్టు సంచిక "ప్రబుద్ధాంధ్ర" ఇప్పుడే అందింది. చూశాను. నా వ్యాసం నేను కోరిన ప్రకారం ఈసంచికలో చేర్చినందుకు కృతజ్ఞుణ్ణి. మీరు నా వ్యాసాన్ని గురించి రాసిన దానిమీద ఒక్క ముక్క రాయదలుచుకున్నాను. ప్రచురణార్థం కాదు. చేస్తే వద్దనను.

ఒక్క విషయం గమనించండి. ఒక్క నాగేశ్వరరావుగారి ఆదర్శం తప్ప మిగిలిన విషయాలను గురించి మీతో నాకు పేచీలేదు. మీరు తూకంగా చెప్పే ముక్కలకూ అభిప్రాయాలు చెప్పేవాళ్ళ గోత్రం దాటుకూ ఏమీ సంబంధం లేకుండా ఉంటున్నది. హిందీప్రచారకుల్ని నేను హద్దులో ఉంచవద్దన్నానా? మీరు చెప్పిన ఉదాహరణలను తాకపోవటానికి నా సమ్మతే కారణం. నాకు హిందీ వ్యామోహం ముమ్మరంగా వుందని ఎట్లా గహించారో తెలీదు. నాకు హిందీ అక్షరాలైనా వచ్చునని ఎవరికీ తెలీదు. హిందీ అర్థం చేసుకోవటం సుమారుగా మాట్లాడగల్గటంతో, నాపని అయిపోయిందని కూడా స్పష్టంగా చెప్పాను. ఇక నాగేశ్వరరావుగారు చెప్పిన ముక్క నాకు ముచ్చటగా ఉండటానికి కారణం ఆయన చెప్పేది సంభవమని కాదు. చాలా ఆశయాలు గొంతెమ్మ కోరికలుగానే ఉంటై. కాని నేను ముచ్చటపడ్డది నాగేశ్వరరావుగారు తెలుగుసారస్వతానికి శరీరద్రవ్యాలిస్తూ కూడా భాషకు రాజకీయంతో గల సంబంధం గ్రహించినందుకు. నాగేశ్వరరావుపంతులుగారంత అజ్ఞాని అని భావించుకున్నా హిందూదేశంలో హిందీ తప్ప మిగిలిన భాషలన్నీ నశిస్తవని నమ్మటానికి కారణం లేదు. అటువంటి నమ్మకం ఏరోజున కలిగితే ఆరోజునించీ భారతీ ఆంధ్రపత్రికలు హిందీలోనే వచ్చేవి. వాటి సర్క్యులేషను కూడా పెరిగే ఉండేదేమో!— పరిస్థితులు చూస్తే.

పత్రికల విషయం మీరు చెప్పింది చూడండి. ఇంగ్లీషు పత్రిక కొనేవాడు భాష అభివృద్ధి చేసుకోవానికి కొనడు. హిందీ వచ్చీ రానివాడు కూడా భాషకోసం హిందీపత్రిక కొంటాడు. ఇక ఇంగ్లీషు తెలుగు పత్రికల్లో ఒక తారతమ్యం ఉంది. ఇంగ్లీషు అర్థమైన వాళ్లలో కూడా సగం మంది ఇది పిచ్చి ఇంగ్లీషు, ఇది మంచి ఇంగ్లీషు అని చెప్పలేరు. తెలుగట్లా కాదే! తెలుగు పత్రికలు బాగుపడాలంటే తెలుగుపత్రికలు బాగుపడటమే మార్గం కాని ఇతర పత్రికలు పడిపోవటం కానే కాదు. మీరా పాయింటు గ్రహించవలిసిందే కాని వాదన లాభం లేదు. ఆంధ్రుల్లో పదిహేను వీసాలు ఇతర భాషల వెంట పరిగెత్తినా మనం అధైర్యాపడవలసిన అవసరం లేదంటున్నాను. కాని మీరు ఒక్కటి రుజువు చెయ్యగలిగితే నేను రాసిన వ్యాసం వ్యర్థమౌతుందని ఒప్పుకుంటాను. హిందీ నేర్చుకునేవాడు తెలుక్కి సహాయం చెయ్యటం అసంభవమా? అయితే హిందీ పోతే గాని తెలుగు నిలవదు. నామట్టుకు నాకా అనుమానం లేదు. ప్రతి ఆంధ్రుడూ హిందీ నేర్చుకుని కూడా తెలుగు అభివృద్ధికి అడ్డం లేకుండా ఉండవచ్చును. తెలుగు వదిలి హిందీ ఎత్తుకోండి అని ఎవడైనా ప్రచారం చేస్తే వాడివల్ల తెలుగుకు కలిగే లాభం లేదు. ఇంకొకటి గమనించండి. వీధి పక్కన మురుగు కాలవలు తప్పవు. జైలుకు పోయిన వాళ్లలో ఎటువంటి వాళ్లున్నారో చూడండి. ప్రచారకులు—హిందీప్రచారకులు కూడా అంతే. వాళ్లకోసం ఎదురు ప్రచారం ఎందుకు చెయ్యాలో నా కర్థం కాలేదు.

మీరు చెప్పే దానికీ ఇతరులు చెప్పే దానికీ సంబంధం లేకుండా ఉంది. వాళ్లను మీరు వెనకేసుకొస్తే లాభం లేదు.

నా వ్యాసం చిత్తు రాసి తిరిగి రాయటంలో "ఆంధ్రభూమి" పేరు ఎట్లా వదిలేశానో వదిలేశాను. కాని నేను రాసిన దాన్లో ఆంధ్రభూమికి సమాధానం "హిందీ, తెలుగుపత్రికలు" అనే ఘట్టంలో ఉంది. గమనిస్తారు గాక! సెలవు"

—కొడవటిగంటి కుటుంబరావు

(ఆంధ్రభాషలో ప్రావీణ్యమూ, ఆంధ్రరచనలో చాతుర్యమూ, ఆంధ్రత్వాన్ని గురించి గర్వమూ వుండే ఆంధ్రుడెలా రాయాలో కుటుంబరావుగారలా రాశారు. చాలా సంతోషం. ఇక మేము జవాబు చెప్పవలసిందల్లా వొకటే ప్రశ్న. "హిందీ నేర్చుకునేవాడు తెలుక్కి సహాయం చెయ్యడం అసంభవమా!" ఎంత మాత్రమూ కాదు; కాని ఆసంకల్పం వుండాలి. "మనం పరభాషలు నేర్చుకున్నందుకు ఆభాషలలో వున్న మహాగ్రంథాలన్నీ, ఉత్తమవాఙ్మయం అంతా మన భాషలో వుండా" లనే ఆశ వుండాలి. "మన వాఙ్మయం సర్వాంగసుందరంగానూ, ఇతర్లకి లోభం పుట్టించేదిగానూ వుండా" లనే ఆవేదన వుండాలి. ఇది వున్నవాడు హిందీ వొక్కటే కాదు ఎన్ని భాషలు నేర్చుకున్నా ఆక్షేపణ వుండదు. నేర్చుకుంటే లాభం కూడాను. నేర్చుకోవడం అవసరమున్నూ. అయితే యిప్పటి హిందీ ప్రచారం యిందుకనురూపంగా జరుగుతోందా! వృత్తివిద్యలు కూడా హిందీలోనే చెప్పాలన్న ఆప్టేగారి వుద్దేశమూ, హిందీని మనం వ్యావహారికంగా వాడుకోవా లనే పీసపాటి సుబ్బారావుగారి అభిప్రాయమూ, గమనిస్తే దక్షిణభారతదేశంలో యీ హిందీప్రచారం యెందుకోసం జరుగుతోందో వేరే చెప్పనక్కర లేదు. ఈ సంచికలో వొక రాష్ట్రభాషావిశారదుని లేఖ కూడా వుంది. దాన్ని చూస్తే హిందీమానసపుత్రుల ప్రయత్నాలు ఆంధ్రభాషని అడుక్కి తొక్కెయ్యడానికే అని స్పష్టంగానే బోధపడుతుంది. అయితే యీ ప్రయత్నాలు నెరవేరి తెనుగు నిజంగా చచ్చే

పోతుందా అని కుటుంబరావుగారి సందేహం. మే మీ ప్రచారకుల మాటల నెందుకు కుగాహారం గా మీ కుటుంబరావుగారు బాగా యోచించవలసి వుంది. గృహలక్ష్మి కూడా యీ సంగతి గమనించకుండా యేమి టేమిటో రాసింది. ఏదో వొక ప్రయోజనం కోరి మన వారు నేర్చుకుంటూ వున్న ఇంగ్లీషు సకలవిషయాలలోనూ మన నెల్లా ఆక్రమించేస్తోందో తెలుసుకుంటే, ప్రారంభంలోనే ఆత్మగౌరవాన్ని చంపిన హిందీ ముందు ముందు మన కింకా యెలాంటి స్థితి కలిగిస్తుందో బోధపడుతుంది. సంపాదకుడు)

౨

"అయ్యా! ఆంధ్రదేశంలో హిందీప్రచారం విషయంలో తామ ఒక్కసారి ఆంధ్రుల దృష్టిని అంతర్ముఖం చేసినందుకు వందనాలు. మీరు పూరించిన భయంకరనాదం దాదాపు అన్ని తెలుగుపత్రికల్లోను మారుమోగింది. అనుకూల ప్రతికూలములైన చర్చలు జరిగినాయి. వీటిని బట్టి మనం కొన్ని సారాంశాలు తేల్చుకోగలిగి ఉన్నాము. ఈవిషయం నిజానికి నన్ను కూడా కొంత కలచిందే అవడంచేత ఒక్క సూచన చేస్తున్నాను.

ఇంతవరకూ సాధారణంగా అంతా అంగీకరించిన సారాంశా లేమంటే (౧) భారతవర్షం యొక్క రాజకీయ పురోభివృద్ధికి ఒక సామాన్య భాష అత్యవసరం (౨) హిందీ మాత్రమే అనేక హేతువులచేత ఆస్థానం ఆక్రమించుకోగలుగుతుంది. (౩) అందుచే హిందీప్రచారం ఆవశ్యంగా జరగవలసిందే. ఇంక వివాదాంశ మేదంటే ఈప్రచార విధానాన్ని గురించి. నిజమే, కొంతమంది ప్రచారకుల అమితోత్సాహావేశాలు మాతృభాషాభివృద్ధికి ప్రతిబంధకంగా కూడా పరిణమిస్తూన్న వన్నమాట కాదనడానికి వీల్లేదు ఇందుకు మీరు కష్టించి ఆంధ్రపత్రికలోనుంచి ఎత్తి వ్రాసిన హిందీప్రచారకుల ప్రసంగాలే తార్కాణం. ఈస్థితిలో హిందీ ఆవేశంలో ఆత్మవిస్మృతికి లోనై కొట్టుకు పోయే ప్రచారకుల దృష్టిని ఒక్కసారి ఆత్మశోధన వంకకు తిప్పడం అవసరమే అని నేనున్నూ తలుస్తాను చాలా మంది హిందీప్రచారకులు దేశసామాన్యభాష అయిన హిందీకిన్ని మాతృభాష అయిన తెనుగుకున్నూ గల తారతమ్యం సరిగా గుర్తించినట్లు తోచదు. కారణం వారిలో తెనుగు సంస్కార లోపమే. తెలుగు బాగా నేర్వకుండానే హిందీ అభ్యాసం చెయ్యడంవల్ల ఈలాంటి విపర్యాసం కలుగుతూన్నది నిజానికి శివన్నశాస్త్రిగారి లాగు తెలుగు పాండిత్యం గడించి కాని అథవా, కొంతయైనా తెలుగు పరిజ్ఞానం అలవర్చుకొని కాని హిందీ నేర్చుకొని ప్రచారకులుగా పని చేసే వారు నేటి ప్రచారకుల్లో ఎందరున్నారు? తెలుగు చవి యెరుగని హిందీప్రచారకులనుంచి ఇంతకంటె యెక్కువ ఆశించడం కూడా పొరపాటే. అందుచే మాతృదేశాభివృద్ధికి ముందుగా మాతృభాష, అతర్వాత రాష్ట్రభాష ముఖ్య మని గ్రహించి ఉభయభాషావిదులైన హిందీప్రచారకులను తయారుచేస్తే మీరు భయపడే అనర్థకము తావు లేకుండా పోతుంది. అప్పుడు హిందీప్రచారకులు ఆంధ్రభాషాభిమానంతోటీ, ఆంధ్రభాషాజ్ఞానంతోటీ నిండి హిందీప్రచారానికి మట్టుకే కాక ఆంధ్రాభ్యుదయానికి కూడా తోడ్పడగలుగుతారు. అందుచే హిందీప్రచారకులుగా పని చెయగోరే వారంతా ముందుగా తమ దృక్పథాన్ని మార్చుకోవలసియున్నూ తమ తెలుగు జ్ఞానం విస్తరిప జేసుకోవలసియున్నూ మంచి దని నా తలపు. ఈలాగయితే వీరి తెలుగు వేసబాసలు ఏమాత్రమున్నూ వికృతి పొందవు వీరు హిందీని మరింత సులువు పద్ధతుల్లో బోధింపగలుగుతారు వీరు తాము ప్రచారం చేసే పల్లెపట్టణాల్లో కొడిగారుతూన్న తెలుగు దీపానికి కొంచెం తైలం పోసినవా రవుతారు. వీరివద్ద తర్ఫీయతు అయే విద్యార్థుల్లో తెలుగు అభిమానం చిగిరింప చేస్తారు. వారి దృష్టిని తెలుగు

పత్రికలమీదికీ, పుస్తకాల మీదికీ కూడా ప్రసరింప చేస్తారు. ఇంతే కాక తాము నేర్చిన హిందీలోని సద్విషయాల్ని తెలుగులోకి మార్చి తెలుగువాఙ్మయాన్ని విశాలకరుస్తారు

హిందీ ప్రచారకులారా! ఈఅలజడి కేవలం హిందీమీది అసూయచేతనే పుట్టిందని అనుకోకండి. దీని పరమార్థం మీరు బాగా గ్రహించి హిందీ దేశభాషలకు సైదోడు మాత్రమే కాని శత్రువు కాదనిన్నీ, హిందీకి తెలుగు యిళ్లల్లో తావు ఇవ్వడం కొంపకు ముప్పు తెచ్చుకోవడం యే మాత్రం కాదనిన్నీ, భారతజాతీయత ఆంధ్రత్వానికి విరుద్ధం కాదనిన్నీ మీరు మీనడవడిచేతను, ప్రచారపద్ధతులచేతను నిరూపించవలసియున్నారు.

—మంగిపూడి పురుషోత్తమశర్మ

(మా మిత్రులు పురుషోత్తమశర్మగారు మే మీ ప్రచారం మొదలుపెట్టక మునుపే హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారాన్ని గుర్తించి వున్నారు. వారప్పుడప్పుడు కాంగ్రెస్సు గుడారాల్లో హిందీ దురాక్రమణం విషయమై తమ అసమ్మతిని దృఢంగా వెల్లడిస్తూనే వచ్చారుట. అయితే తాము గ్రహించిన ఆపత్తును పత్రికల ద్వారా వారప్పుడే దేశీయులకు తెలియపరిచి వుండవలసింది. వారప్పుడలా చేసే వుంటే హిందీ ముగ్ధుల దుష్ప్రచారం యింత ముదిరిపోయీ వుండక పోవును. అస్మదాదు లిప్పుడింత నిక్కచ్చిగా ప్రతికూలప్రచారం చెయ్యవలసిన అవసరమూ లేక పోయి వుండును, కాని యేదో వొకానొక ప్రతిష్ఠ వారి నప్పుడీ పనికి పూనుకోకుండా ఆటంకపరిచి వుంటుంది. అయినా యిప్పుడేనా వారింత సరళంగా—యింత వివరంగా—యింత నిర్మొగమాటంగా హిందీప్రచారకుల విచ్ఛేదకర ప్రయత్నాలను బహిరంగపరిచి యిది తప్పనీ, మాతృద్రోహ మనీ ముక్తకంఠంతో చెప్పడం చాలా మంచి పని... శర్మగారు ఆంధ్రభాషలో ప్రావీణ్యం లేని ఆంధ్రులు తమ వారిలో హిందీ ప్రచారం చెయ్యడం చాలా తప్పని ఖండితంగా చెబుతున్నారు. తమ దేశాన్ని తనుకి తామై ప్రేమించ గలిగే వారూ, తమ భావయంత్రం యెప్పుడూ మాతృభాషలోనే పని చేస్తుం దని గ్రహించుకో గలవారూ, తనకు మాలిన ధర్మానికి సిద్ధపడడం ఆత్మహత్య అని యెరిగి వున్నవారూ చెప్పవలసిన మాటే యిదీ,

సంపాదకుడు)

3

“శాస్త్రిగారూ! హిందీప్రచారము పట్ల మీరు వ్యతిరేకాభిప్రాయములు ఏల చూపుచున్నారు? ఏదియో యొక పక్షమునం దుండుట ప్రతి పత్రికయొక్క స్వభావము. హిందీ ప్రచారము కావలయు ననెడి పత్రికలు కొన్ని. హిందీప్రచారము చేయకూడ దను పత్రికలు కొన్ని. ‚ఆంధ్రభూమి’ చంద్రిక. ప్రబుద్ధాంధ్ర, భారతి హిందీప్రచారమును ఎదుర్కొనుచున్నను, ఆంధ్రదేశములో హిందీప్రచారము తగు నని మాత్రము తాము కలలోనైనను తలంపకుందురు గాక.

మీరు ఆంధ్రదేశములో స్థాపింపబడిన హిందీ మహావిద్యాలయములను గూర్చియే వ్రాయుచున్నారు గాని ప్రతి పట్టణములోను, ప్రతి పెద్ద గ్రామములోను స్థాపింపబడిన ఆంగ్లపాఠశాలలను గూర్చి వ్రాయరైరి. ఆంధ్రదేశములో నున్న హిందీవాగ్వర్ధనీమండలులలోను సభలలోను హిందీభాషయందే మాట్లాడవలె నన్న వారిని దూషించుచుండిరి. కాని ఆంగ్లపాఠశాలలో నుండు ‘Debating society’ లను గూర్చి మాటయైనను ఎత్తరైరి. కారణము ఏమియో తెలియకున్నది మీకు వాస్తవ ముగు ప్రేమ ఆంధ్రభాషయందే యున్నచో ఆంగ్లభాషా ప్రచారము పట్ల గూడ వ్యతిరేకాభిప్రాయము చూపుట మంచిది. ‚హిందీ—తెలగు’ హిందీవల్లవ

అనే వ్రాయుచుందురు గాని ఆంగ్లము—తెలుగు, అని కూడ వ్రాసిన చాల బాగుండును. శాస్త్రి గారూ! మీరు నాగేశ్వరరావుగారిని కూడ నిందించుచున్నారు. శ్రీ నాగేశ్వరరావుగారికి ఆంధ్రము యందు గల ప్రేమలో మీకు ఉన్న ప్రేమ ఎన్నవంతో మీకే ఎరుక.

నిజమును గుర్తెరిగి వ్రాసిన వారిపై మీరు కోపమును వెలిబుచ్చకూడదు. హిందీ రాష్ట్రభాష. హిందీభాషాభివృద్ధికై ప్రతి ఆంధ్రుడును పాటుపడవలె నని నాయకులు ఇంకను బోధించుచున్నారు

హిందీ చదివిన మాత్రమున ఆంధ్రమందు ద్వేషము కలవా రగుట లేదు. మీరు ఈపైన నైన హిందీభాషాప్రచారము పట్ల ద్వేషము చూపించకుందురు గాక. శాస్త్రిగారూ! హిందీప్రచారము అనునది పొంగి ఆంధ్రదేశ మంతటను వ్యాపించినది. దాని నాప మీతరమా? గృహలక్ష్మి సంపాదకులు నిజమును గుర్తెరిగి తమ పత్రికయందు మీబోట్లు వ్రాసిన వ్రాతలను ఖండించినారు. ఆంధ్రు లందరు ప్రత్యేక హిందీప్రచారసభను ఏర్పరచవలె నని తలచుచున్న సమయమున మీవ్రాతలు చూచిన చాల నవ్వుకొనెదరు.

అసలు వ్యతిరేకభావమును చూపినది మీరు తరువాత చంద్రిక ఆంధ్రభూమి మొదలగు పత్రికలు ప్రారంభించినాయి దక్షిణభారతహిందీ ప్రచారసభయొక్క ఉపాధ్యక్షు లగు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారి అధిపత్యమున ప్రచురింపబడుచున్న భారతి పత్రికకు కూడ మీవాసన తగిలినది. ఏది ఎటు లున్నను ఆంధ్రదేశమందు హిందీప్రచారము తగ్గదు.

మీవ్రాతలను సమర్థించు శ్రీ ఉేకుమళ్ల కామేశ్వరరావుగారు కూడ పైసంగతు లన్నియు గ్రహించి ఈపైన హిందీప్రచారము పట్ల వ్యతిరేక అభిప్రాయము చూపకుందురు గాక

—మల్లాది నరసింహసోమయాజులు
"రాష్ట్రభాషావిశారద"

(ఆంగ్లవాఙ్మయం మన కళ్లు తెరిచింది అయినా దేశక్షేమాన్ని కోరేవా రంతా దాని ప్రచారాన్ని తగ్గించా లనే చెబుతున్నారు ఈహిందీప్రచారం కూడా యిందు కోసం పుట్టిందే అయితే "నీపుర్ర చెయ్యి తియ్యి నాలోట్ట చెయ్యి పెడతా" నన్నట్టు ఇంగ్లీషు చెయ్యని అపకారం కూడా హిందీ చేస్తోంది ఇంగ్లీషులో బ్రహ్మాండ మైన వాఙ్మయం వుంది. కనక అది అపకారంతో పాటు ఉపకారం కూడా ఎక్కువగానే చేస్తోంది మన వాఙ్మయాన్ని వృద్ధి చేసుకోవా లంటే యిప్పుడు ఇంగ్లీషు నాశ్రయించడం మనకి తప్పదు. హిందీవల్ల మన కేమీ లాభం లేదు. హిందీలో సరి యైన వాఙ్మయం యేమీ లేదు. హిందూభాషల్లో కూలంకష మైన వాఙ్మయం వున్న భాష వొక్క బంగాళీ మాత్రమే. హిందీ నేర్చుకునే విద్యార్థులకు పాఠ్యాలుగా నిర్ణయించబడుతూ వున్న గ్రంథాలు చాలా బంగాళీనుంచో అనువదించబడ్డవే కాని హిందీలో అంతగా తగిన స్వతంత్ర గ్రంథాలు లేవు. హిందీయొక్క తాహతుని ఈవిషయమే చక్కగా చెబుతోంది. కాకపోయినా అభిమానం విడిచి మనవారు యిలాంటి భావాలు ప్రకటిస్తూ దుష్ప్రచారం ప్రారంభించడంవల్లనే మే మిలా హిందీకి ప్రతికూలత కనబరచవలసివచ్చింది. మా ప్రచారంలో వున్న ధర్మమూ, బలమూ దక్షిణ భారత హిందీ ప్రచారసభయొక్క ఉపాధ్యక్షులైన శ్రీ నాగేశ్వరరావు పంతులుగారికి కూడా తెలిసినవే.

సంపాదకుడు)

౪

"మహాశయా, అభినందనములు మీ 'హిందీ' దాడికి. తెనుగు మినిమికి పస నిడ్డ తిక్కన మొదలుకొని మన తెలుగు భాషకి అన్నీ అవాంతరాలే. నేడు కలిగిన 'హిందీ' ఉపద్రవంనుండి ఆంధ్రభాషను మీరు తప్పించుటకు ప్రయత్నించడం బహుళంగా ఆంధ్రదేశీయుల్ని ఆకర్షించింది. 'గృహలక్ష్మి' మాత్రం హిందీవల్ల మన భాషకి ఉపద్రవం ఆక్షేపకలగనేరదనీ గోడమీద పిల్లివాటంగా చెప్పినా, అన్ని పత్రికలూ మీ వాదాన్ని బలపరిచాయి. హాస్యరసపత్రికైన 'వినోదిని' కూడా మీ యీ వాదాన్ని బలపరిచింది సంపాదకీయవ్యాసంలో. ఆంధ్రభాషకు మీ రీవిధంగా చేస్తున్న సేవ జూసి 'భళీ' అంటోంది ఆంధ్రమాత! మీరు ధన్యులయ్యారు. అందుకు నా ధన్యవాదాలు అందుకోండి.

నేను కూడా మీ వాదాన్ని బలపరుస్తూ ఒక 'హిందీ' లేఖను పంపాను ప్రకటనార్థం: మీ వాదాన్ని యథాశక్తిగా నేను బలపరిచాను. 'హిందీ వెల్లువ ఆంధ్రభాష' మీద మేట వేయకుండా, మీరు కడుతూ ఉన్న చెలియలి కట్టకు 'ఉడుతాభక్తి'గా నేనూ సాయం చేస్తున్నాను.

కాని, ఒక అంశం:

స్వర్గీయ నెహ్రూగారి ప్రతిభ జాతీయవీరుడుగా సమరంలో సేనానిగా ఉండడంచేతనే గాక ఒక రాజకీయప్రణాళికను సిద్ధపరచడంలో కనపడింది. అట్లాగే మీరు యీ హిందీప్రచారం యొక్క హద్దు మీరడాన్ని ఖండించడమే గాకుండా, యిక ముందు హిందీప్రచారం ఆంధ్రభాషకి హాని కలక్కుండా నడపే విధానాన్ని సూచిస్తో ఒక ప్రణాళికను తయారు జేసి ద. భా. హిందీప్రచారకసభకి పంపితే బాగుంటుందని నా అభిప్రాయం. సమాధానమార్గంగా మనం సంచరిస్తే ప్రచారకులు కూడా తల ఒగ్గక మానరు. ఉభయత్రా యిట్టి సామరస్యం ప్రయోజనకర మనే నేను తలుస్తాను"

దేవగుప్తాపు విశ్వేశ్వరరావు

౫

"తెలుగువారి హిందీ చదువు" వలన తెలుగున కపకారము జరుగుచున్న మాట వాస్తవము. ఇదివఱకింగ్లీషు చక్కటిదియే తెలుగున కపకరించుచుండునది. ఇపుడు హిందీ దానికి శత గుణముగా నపకరించుచున్నది. ఈయపకార మాభాషలవలన నగుచున్నది కాదు. వానిని జదివిన తెలుగువారి వలలనే సంప్రాప్త మగుచున్నది.

తెలుగువారిది వివేచన లేని ఉత్సాహము; ఆత్మహితము దెలియని ఆవేశము. దీనివలన వారికి పొసగు ననర్థము లనేకములు.

తెలుగువారు హిందీ రాష్ట్రభాష కావలె నను నిర్ణయము విన్నారు, హిందీప్రచార ప్రారంభమును గన్నారు? అంతే, హిందీ చదువ ప్రారంభించినారు. ఇప్పటికి దక్షిణభారతమున హిందీ చదివిన, చదువుచున్న వారిలో సగము మందికి పైగా వారు తయారైనారు. తెలుగు కూడ చూని వేసి హిందీని చదివిన వారు వీరిలో ననేకులు. ఎన్ని భాషలు వచ్చినను మాతృభాషనే మాటాడవలయునన్న నియమము తదితరులకు; హిందీ వచ్చిన వారు హిందీలోనే సంభాషింపవలె నను నియమము తెలుగువారికి. తెలుగే వలదు, హిందీనే చదువుడనియు ప్రబోధించువారు కూడ పలువురు. ఊరూర హిందీ పాఠశాలలు వెలసినవి తెలుగునాట. ప్రచారకులు ననేకులు. ఇది యంతయు తెలుగువారి నిరుపమదేశోద్ధరణవాంఛను ప్రకటించుచున్నది. ఇది యెంతవఱకు సఫలము కాగలదో ఊహించుట కిపుడు సాధ్యము కాదు; కాని,

దీని వలన ప్రకృతము వారి మాతృభాషకు మాత్రము మహోపద్రవము కలుగుచుండుట నిక్కము.

హిందీ చదివిన తెలుగువారు ఏది మాటాడినను ఏది వ్రాసినను అంతయును హిందీ సంప్రదాయములతో నింపివేయుచున్నారు ఇందువలన వికృత స్వరూపము, విపరీతస్వభావము తెలుగునకు ఏరుపడినవి. దాని తీయదనము దిగజారిపోయినది. దాని వ్యక్తిత్వమునకే హాని యగుచున్నది. 'దేశభాషలందు తెలుగు లెస్స' యను ఖ్యాతి గనిన తెలుగునకు నేటికీ తీరున చేటు వాటిల్లినది. దాని తీరుతీయముల మేలితనమును తెలిసిన సహృదయుల కిది దుస్సహము. కావుననే దేశమున నలజడి పుట్టినది. తెలుగు తెలుగుదనమును కాపాడుకొనవలె నను హెచ్చరికలు నలుమూలల మారుమ్రోయుచున్నవి. ఈప్రబోధము న్యాయ్యోతరము కానట్టి కర్తవ్యము.

హిందీ రాష్ట్రభాష యగుట కెవ్వరికిని విప్రతిపత్తి యుండ బనిలేదు—దేశక్షేమము కోరని దేశీయు లుండరు కాన. హిందీ యెడ ద్వేషము నుండ బని లేదు. కాని ప్రతివారికిని మాతృభాష యెడ నాదరము బరమావశ్యకము, తదుద్ధరణము ప్రథమకర్తవ్యము. నాయకులు నిఖిలభారతదేశమున కొక రాష్ట్రభాష కావలయు నన్నారు దేశవ్యవహారముల నడుపుకొనుటకు. వా రెవ్వరు నెన్నడు మాతృభాషలకు స్వస్తి చెప్పు డని శాసింపలేదు. తాము నట్లు చేయలేదు.

అరవలు, కన్నడులు, మలయాళులు, ఇతరులు హిందీని నేర్చుకొనుచున్నారు కాని వా రెవ్వరును తెలుగువారి వలె మాతృభాషను పాడుచేసికొనలేదు వివేకులు స్వవిషయములయం దెప్పుడును జాగ్రత్త గలిగియే యుందురు.

తెలుగువారి యజాగ్రత్త, యవివేకము వారి భాషకు నీ తీరున చెరుపును కలిగించుటయే కాక దేశనాయకులకును అపకీర్తికళంకమును దెచ్చిపెట్టునవి. ఇక నయినను ప్రబుద్ధు లయి తెలుగువారీ రెంటిని దూరముగ పోబెట్టుదురు గాక!

భారతి (ఆగష్టు)

౬

"మైసూరులో శ్రీమతి సరోజనిదేవి హిందీ ప్రచారసభ్యుల కుపదేశించుచు నిటుల ప్రసంగించెను.

"మీరు చాల మంచి పని చేయుచున్నారు. ఒక ప్రాంతమునుండి మరియొక ప్రాంతమునకు బోవువా రొకరి భాషల నొకరు తెలుసుకొనుటకు సాధారణ మగు జాతీయభాష యొక టుండవలయును. ఉత్తరదేశపు స్త్రీపురుషులు వచ్చినపుడు వారితో సంజ్ఞలతో మాట్లాడెదము. అంత కన్న వారి భావము లేమో తెలుసుకొనజాలము. అందుచేతనే గాంధీమహాత్ముడు హిందీ జాతీయభాషగ నుండవలె నని నిర్బంధముగ నాదేశించెను. కాని మీరు యెంతవర కందు ప్రవేశ ముండవలెనో యోచించుకొని హద్దులను దెలుసుకొనవలెను. ఈసంస్థానమునందు కన్నడమే దేశభాష. కన్నడ భాషనే యిచటి పౌరుడు పెంపొందించవలెను. ఈహద్దులను తెలుసుకొని మీరు చేయుచున్న చక్కని ప్రచారమును జేయవచ్చును. కబీరు మహాత్ముని సుందరహిందీ వాగమృతము గ్రోలి భారతదేశమం దన్ని జాతులకును సన్నివేశము సమకూర్పవచ్చును."

"ఈవాక్యము (లు) లను ఆంధ్రమాతృభాషాభిమాను లందరును గమనింపదగినవై యున్నవి. హిందీప్రచారము జేయు నాంధ్రు లందరును యోచింపదగును" ౬—౭—౩౮ ఆంధ్రపత్రిక

మధురపూడి శాసనము

మారేమండ రామారావుగారు. ఎం. ఏ. బి. ఇడి.

రాజమహేంద్రవరమునకు ఏడున్నర మైళ్లు దూరమున గోకవరం రోడ్డుకు అర మైలు దూరములో మధురపూడి గ్రామము గలదు. ఆయూరి చెరువులో నేదిరేరా వ్రాత గల యొక పెద్ద రాయి గలదని కొంతమూరు వాస్తవ్యులైన శ్రీయుత నేదూరి గంగాధరంగారు నాకు తెల్పిరి. అంతట నేనును నామిత్రులగు శ్రీయుత వేకుమళ్ల కామేశ్వరరావుగారును పోయి యారాతిని పరిశీలించితిమి. రాయి సుమారు రెండు గజముల పొడవును, అడుగున్నర వెడల్పును, అడుగు యెత్తును గలది. నీటిలో నుండి దీనిని బయటికి దీయుటకు ౨౦ మంది మనుష్యుల సాహాయ్యము కావలసి వచ్చినది. ఈరాతిపై నొక వైపు గరుత్మంతుడును, సూర్యచంద్రులును చెక్కబడి యున్నారు. నాల్గవ వైపున ౧౬ పంక్తులలో తెలుగు భాషలో నీక్రింది శాసనము చెక్కబడి యున్నది. ఇందు మొదట కాటయవేముని ప్రశంసించు నొక సంస్కృత శ్లోకము మాత్రము గలదు.

మూలము

౧. నప్తా కాటయశౌరేః పౌత్రో మా
౨. రస్య కాటనృపసూనుః (౧) వీరాంనపో
౩. తన్నృపతే ర్జామాతా జయతు వేమ
౪. భూపాలః (౨) స్వస్తిశ్రీ శకవరుషంబు
౫. లు ౧౩౨౬ లగు నేంటి తారణసంవ
౬. త్సర పుష్య సు ౧౦ గు నాంటి మకర
౭. సంక్రాంతి పుణ్యకాల మందూను
౮. కాటయరెడ్డి వేమారెడ్డింగారు తమ
౯. స్వామి అఇన కొమరగిరిరెడ్డింగా
౧౦. రికి అక్షయసుగ్రృతము లవ్వనట్టు
౧౧. గాను మదురుపూండి కొమరగిరి పు
౧౨. ర మని......శ్రీగౌతమీ తీరమం
౧౩. దున్న వేదాద్రి శ్రీవరాహాదేవరకు
౧౪. ఆచంద్రార్కస్థాయిగాను ధార వో
౧౫. సి మహాపుణ్యం సేశిరి. మంగళ మహా
౧౬. శ్రీ శ్రీ జేయున్.

దాత

ఈశాసనమును వేయించిన వాడు రాజమహేంద్రవర రెడ్డిరాజ్య స్థాపకుడగు కాటయవేమారెడ్డి. ఇతడు కొండవీటిని పాలించిన రెడ్డిరాజులలో ప్రోలయవేమారెడ్డికి పౌత్రీపతి. అనపోతారెడ్డికి అల్లుడు, కుమారగిరిరెడ్డికి చెల్లెలి భర్త, మేనమరది.

కాలము

కాటయవేముడు శా. శ. ౧౩౨౬ తారణ సంవత్సర పుష్య శుద్ధ దశమీ గురువారమునాడు ఈశాసనములో చెప్పబడిన దానమును చేసెను. ఇందలి శకసంఖ్యాదికము క్రీ. శ. ౧౪౦౫ వ సంవత్సరము, మార్చి ౧౭ వ తేదీ యగుచున్నది.

విశేషాంశములు

రెడ్లచరిత్రమున కీశాసనము మిక్కిలి ముఖ్యమైనది. కుమారగిరిరెడ్డి రాజధాని యగు కొండవీటిలో విద్యావినోదములతో కాలము బుచ్చుచుండ నతని మరదియు మంత్రియు నగు కాటయవేముడు రాజకార్యముల చక్కబెట్టుచు నుండి, గోదావరీనది మొదలు సింహాచలము వరకును గల దేశమును జయించెను. అందువలననే యీశాసనమున కాటయవేముడు కుమారగిరిని తన 'స్వామి' యని పేర్కొనినాడు. ఇప్పటి మధురపూడికి కాటయవేమునిచే కుమారగిరిపుర మను పేరు పెట్టబడెనని యీశాసనము తెల్పుచున్నది. ఈ గ్రామమునే గాక కాటయవేమారెడ్డి యనేకస్థలముల కుమారగిరి పురము అను దానముచేసెను. ఇట్టి కొన్ని గ్రామముల సమూహమున కాతడు కుమారగిరిమండల మని కూడ పేరిడెను. (E. R. ౧౯౧౫ P. ౧౧౫ Para ౫౬.)

సమస్యలు

ఈశాసనమువలన కొన్ని సమస్య లేర్పడుచున్నవి. అందు మొదటిది క్రీ. శ. ౧౪౦౫ నాటి యీశాసన సంవత్సరమున కుమారగిరిరెడ్డి జీవించియుండెనా యనునది. క్రీ. శ. ౧౪౦౦ ప్రాంతమున ఆరెడ్డిరాజు తన రాజ్యమును రెండుగ విభజించి, యందలి తూర్పు భాగమునకు రాజమహేంద్రవరమును రాజధానిగా చేసి కాటయవేమారెడ్డి కొసంగెను. క్రీ. శ. ౧౪౦౪ నుండియు పెదకోమటి వేమారెడ్డి కొండవీటిని పరిపాలించె నని శాసనములు తెల్పుచున్నవి.

దీనిని బట్టి కుమారగిరి యాసంవత్సరముననో, అంతకు బూర్వమో మరణించె నని తోచుచున్నది. కాని కుమారగిరిరెడ్డి జీవించియుండగనే యతనిని రాజ్యచ్యుతుని జేసి పెదకోమటివేముడు కొండవీటి సింహాసనము నధిష్ఠించె నని శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారును (ఆం. చ. ౩ భా. పే ౧౯౪) "కుమారగిరి ౧౪౦౩ వరకును రాజ్యమేలెను. అతడటు తర్వాత గూడ నాలుగేండ్లు జీవించి యున్నట్టున్నాడు." అని శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రిగారు (శృ. శ్రీ. పే. ౯౧) నభిప్రాయపడియున్నారు. క్రీ. శ. ౧౪౦౦ లోనే కాటయవేముడు రాజమహేంద్రవరరాజ్యమునకు వచ్చి యుండును. క్రీ. శ. ౧౪౦౪ లో కుమారగిరి మరణించి యుండినచో, మరుసటి సంవత్సరము కాటయవేముడు కుమారగిరిని తన 'స్వామి' యని పేర్కొని, యతని కక్షయసుకృతముగా మధురపూడిని దానము చేయుట పొసగనేరదు. కాన పైన చెప్పబడిన శ్రీప్రభాకరశాస్త్రిగారి యూహననుసరించి, యీశాసనకాల మగు క్రీ. శ. ౧౪౦౫ వరకును అనగా పెదకోమటి వేముని రెండవ రాజ్యసంవత్సరమున గూడ కుమారగిరిరెడ్డి జీవించి యుండె నని తోచుచున్నది. ఈశాసనమునుండి బయల్వెడలు రెండవ ప్రశ్న గౌతమీతీరమం దున్న వేదాద్రి యేది? యనునది. శ్రీనాథుడు తన కవితాసంపదకు కమలాచలముపై నుండు మార్కండేయుడును, వేదాద్రిపై నుండు నరసింహస్వామియు గారణము లని కాశీఖండమున జెప్పి యున్నాడు. దీనిని బట్టి యీవేదాద్రి రాజమహేంద్రవరమునం దుండెడి దనియు దానిపై నృసింహస్వామి యుండెడివా డనియు స్పష్టమగుచున్నది. ఈగిరియు నాలయమును గూడ నేడదృశ్యము లైనవి. కంభంవారి సత్రము వెనుక నుండు నాలయములోని దేవుడు వేదనరసింహస్వామి యనియు, నతనికే వరాహనరసింహస్వామి యని కూడ మరియొక పేరు పూర్వ ముండెడి దనియు, రా సంవత్సరములు జీవించి రెండేండ్ల క్రితము మరణించిన మా తాతగారు చెప్పుచుండిరి. దీనిని బట్టి మధురపూడి శాసనములోని వేదాద్రి వరాహదేవర నేడు కంభంవారి సత్రము వెనుక నున్న గుడిలోని నరసింహస్వామి యగుట కవకాశ మేర్పడుచున్నది. రైల్వే వంతెనవద్ద పుష్పగిరియు, నేటి మార్కండేయాలయము వద్ద కమలాద్రియు, కంభంవారి సత్రము వద్ద వేదాద్రియు గౌతమీతీరమున పూర్వ ముండెడి వేమో! మధురపూడి గ్రామము కోరుకొండకు ఐదుమైళ్ల దూరములో నున్నది. అచ్చట నొక నాయకవంశీయులు రాజ్యము చేయుచుండిరి. అట్టి సందర్భమున గాటయవేమారెడ్డి కోరుకొండకు మిక్కిలి సమీపమునం దున్న మధురపూడి నెట్లు దానము చెసె నను మూడవసమస్య ప్రకృతశాసనమూలమున బయల్వెడలుచున్నది. కోరుకొండ కైఫీయతులో రెండవ ముమ్మిడినాయకుడు కోరుకొండలో క్రీ. శ. ౧౩౯౫ వరకును రాజ్యము చేసె ననియు నటుపై కాటయవేమారెడ్డి యీరాజ్యమును జయించి, కోరుకొండ దుర్గములో కొంత సైన్యము నుంచె ననియు చెప్పబడి యున్నది. క్రీ. శ. ౧౪౦౦ నాటికే యీరెడ్డిరాజు రాజమహేంద్రవరమున కేతెంచె నని యిదివరలో చెప్పి యుంటిమి. కోరుకొండకు సమీపమున నున్న మధురపూడిలోని ప్రకృతశాసనము కాటయవేముడు ౧౪౦౦ ప్రాంతముననే కోరుకొండను జయించె నను కోరుకొండ కైఫీయతులోని యభిప్రాయమును బలపరచుచున్నది.

వ్యాఖ్యానములు

ఆంధ్రమహాసభ

"దీ న్నెందుకు జరిగించాలి? దీనివల్ల లాభం యేమిటీ?" అని శ్రీసాధన పత్రికలో వొక ఆంధ్రుని ప్రశ్న.

మంచిదే. ఇందులో రహస్యసందర్భాలేమీ లేవు ఆంధ్రుడిలా అగౌరవతగిన స్థితిలో వుండడమే యీసభని సమావేశపరిచి తీరాలని గొంతెత్తి చెబుతోంది

ఇది సంపూర్ణస్వరాజ్యాన్ని సాధించడం కోసం బయలుదేరలేదు డొమినియన్ స్టేటస్సు సంపాదించడానికి పూనుకోలేదు. దొరతనం చివరికేమిటిస్తే దానితోటే తృప్తిపడడానికిన్ని యిది సిద్ధపడలేదు.

ఆంధ్రమహాసభకి ఇవి ప్రాప్యాలు కావు. పరమావధులున్నూ కావు.

ఆంధ్రమహాసభకి రాజకీయకల్లోలాలతో సంబంధం లేదు. దేశీయుల సందర్భ యేకతాటిమీద నడిపించడమే దీని వుద్దేశం, కాని సలుకున్కులా చెదరకొట్టడం కాదు.

భిన్న ప్రభుత్వాలకు చెంది వున్నా, భిన్నవాతావరణంలో వుండినా జాతిని బట్టి, భాషని బట్టి, సంప్రదాయాన్ని బట్టి ఆంధ్రుడైన ప్రతివాని రక్తమూ వొకచోట పుట్టిందే అని బోధపరిచి, వుదుకెత్తించి ఆంధ్రునికి హిందూసాహిత్యతలో ఉన్నతమైన పదవి భుక్తపడేటట్టు చెయ్యడమే ఆంధ్రమహాసభ పని

దీనికి ముందు,

"ఆంధ్రుడంటే యెలాంటివాడు? ఆంధ్రజాతి యొక్క ప్రత్యేకత యేమిటి? ఆంధ్రుని పూర్వౌన్నత్యం యొక్క పరిమితి యెంత? అది పూర్వపక్షం అయిపోడానికి కారణం యేమిటీ?" ఆంధ్రుని హృదయంలో ఈజిజ్ఞాసని రాజబెట్టాలి.

"ఆంధ్రుని ప్రస్తుతస్థితి యేమిటి? మళ్ళీ సాధించతగిన ఫలం ఏమిటి?" ఆంధ్రుని బుద్ధికి యీ వొరపిడి కలిగించాలి.

"దిగ్భ్రమ కలిగించే అనేక కర్తవ్యాలు గల యీ సమయంలో ఆంధ్రునికి ముఖ్యకర్తవ్యం యేమిటీ? దానికి సాఫల్యం కలిగించే కార్యక్రమం యెట్టిది?" ఆంధ్రుని మస్తిష్కంలో యిలాంటి యోచన రేకెత్తించాలి.

"తోటివారంతా ముందుకి పోతూండగా నేనింకా వెనకనే వుండిపోయానే! సాటివారంతా తమ మౌలికత్వాన్ని నిలుపుకుంటూ వుండగా—బలపరుచుకుంటూ వుండగా నేనింకా వొకరి అడుగులలోనే అడుగులు వేస్తూ—వొకరి ఆజ్ఞల కోసమే చెవులొరజేసుకొంటూ దాస్యం చేస్తున్నానే! మౌలికత లేని వాడని నవ్వులాటపాలవుతున్నానే!" అని ఆంధ్రునికి ఆవేదన పుట్టించాలి.

"భారతదేశం అంతా విహారరంగంగా చేసుకుని, మహాసామ్రాజ్యాలు నిర్మించి, అనేక ప్రాంతాలవారిని పరిపాలించి—అయ్యో! నేడు భృత్యునిగా అనుచరునిగా—మట్టితలకాయవానిగా యీసడించబడుతున్నానే" అని ఆంధ్రునికి ఆవేశం కలిగించాలి.

ఇంత పని జరగాలంటే, ఇంత ఫలం కలగాలంటే యేమిటి దారి?

తోసిపారేస్తే పోదు. బూకరిస్తే చెల్లదు. కప్పెడితే ఆగదు.

మనకిప్పుడు ఆంధ్రమహాసభ వొక్కటే ఆధారం. ఆంధ్రమహాసభ వొక్కటే మళ్ళీ మనకి చైతన్యం కలిగించేది.

హైదరాబాదురాజ్యంలో ౧౦ సంవత్సరాల యీమధ్యకాలంలో తోటి మహారాష్ట్రుడు వొక్కడేనా కలవకపోయినా ౧౭ లక్షల ఆంధ్రులు మాహమ్మదీయమతంలో కలిసిపోయా రన్నా, బళ్లారిజిల్లాలో కన్నడుల ఔద్ధత్యాన్ని ఎదిరించలేక తొమ్మిదిలక్షల ఆంధ్రులొక్క తరంలో కన్నడులైపోయా రన్నా, మూడు మూర్తులా ఆంధ్రులైన చిత్తూరు మాండలికలు అయత్నంగా అరవలై పోతున్నా రన్నా—కారణ మేమిటి? ఈసంగతులు మనలో అనేకులకు తెలవలే దంటే యేమన్న మాట? తెలిసినవా రేనా కుక్కిన పేలలాగ కిక్కురు మనకుండా వూరుకున్నా రంటే యేమన్న మాట!

వోఢ్రులు వొక పెద్ద ఆంధ్రభూఖండాన్ని సాయంపట్టేస్తున్నారు. అక్కడి మనవారు మొదట కొంచెం ఆందోళనం సాగించారు, గాని యిటీవల మళ్లీ ఆత్మవిస్మృతి పొందారు. తమ హృదయంలో కల్గిస్తూ వున్న భాధ కంటే వారికి ఎక్కణ్ణుంచో వినపడ్డ మాటలు చురుకుపుట్టిస్తున్నాయి కారణం.?

మన ఆంధ్రత్వం విరిగిపోయింది. మనలో మన పూర్వుల రక్తం యింకిపోతోంది.

కాని యింకా పూర్తిగా మరపు కలగలేదు. పునర్వికాసానికి అవసరాలైన సన్నివేశా లింకా పూర్తిగా నశించలేదు.

ఆంధ్రమహాసభని మళ్లీ సమావేశపరచండి. ఆంధ్రునిలో ఆంధ్రరక్తం మళ్లీ వుబుకుతుంది. ఆంధ్రతేజస్సు మళ్లీ విజృంభిస్తుంది. ఆంధ్రు డంటే సింహప్పిల్ల అని భారతదేశం అంతటా ప్రతిధ్వనింప చేస్తుంది.

మరచిపోయారా? వొకప్పుడు ఆంధ్రమహాసభ మళ్లీ మనకి ఈఆశ పుట్టించలేదూ? ఈమూలనుంచి ఆమూలకీ, ఆచివరినుంచి ఈచివరికీ వొక్క ఆవేశతరంగాన్ని వురికించలేదూ?

రాయలసీమలో ఆంధ్రమహాసభ జరగా లని అక్కడివారి కెవరికీ కోరిక లేదంటాడు "ఆంధ్రుడు" వెర్రి మాట యిది. మూరురాయరగండడైన శ్రీకృష్ణదేవరాయ సార్వభౌముని సింగపుగడ్డకంటే ఆంధ్రమహాసభకి తగిన స్థలం యేం వుందీ?

మాకు తెలుసు "ఆంధ్రుని" మనస్సులో ద్వేషం లేదు. అది వొకానొక సన్నివేశంవల్ల కలిగిన అసంతృప్తే గాని ద్వేషం కాదు ఆంధ్రులంతా త్రికరణశుద్ధిగా—ఎడతెగకుండా ఆంధ్రమహాసభని సేవించుకుంటూ వుంటే ఆ "వొకానొక సన్నివేశం" తటస్థించకే పోవును

ఇప్పు డేనా మించిపోయింది లేదు అనంతపురం మాండలికులూ, మళ్లీ నూతనావేశంతో ప్రారంభమైన శ్రీసాధనపత్రికా, యుప్పరించుకోలేని వైకల్యంతో క్షోభపడుతూ వున్న "ఆంధ్రుడూ" వెంటనే నడుములు కట్టి నిశ్చితమైన ఆంధ్రమహాసభని జరిపి ఆంధ్రజాతీయభావానికి మళ్లీ దృఢమైన పునాది వేస్తారు గాక.

పొరబాటా? వుద్దేశమే యిదా?

"హిందీప్రవాహమునకై ఆనకట్టు నిమిత్తము ఆంధ్రరాష్ట్రమునం దక్కడక్కడ ప్రయత్నములు జరుగుచున్నవి ఆ ఆనకట్ట మంచిదే. హిందీప్రచారకశిక్షణము బడయవచ్చిన మీ రందరు హిందీతో బాటు ఆంధ్రభాషాజ్ఞానమును సైతము సంపాదింపవలయును"

౨౯-౭-౩౮ ఆంధ్రపత్రిక పేజీ ౮. కాలం ౫

బెజవాడలో ఆంధ్రప్రాంతీయహిందీమహావిద్యాలయంలో జరిగిన ప్రచారక తరగతి ప్రారంభోత్సవంలో విద్యార్థుల్ని దీవిస్తూ మాగంటి బాపినీడుగా రన్న మాట లివి,

బాపినీడుగారు శుద్ధహిందూస్థానీ పెద్దమనిషి మాట్లాడవలసినట్లు మాట్లాడారు.

బాపినీడుగారికి హిందీప్రచారం చేసే తెనుగువారికి తెనుగుభాషలో పాండిత్యం వుండా లన్న సంగతి తెలుసు. అయితే వారు తెనుగులో పాండిత్యం సంపాదించి తరవాత హిందీ నేర్చుకోవడమా, లేక హిందీ నేర్చుకుంటూనే తెనుగు నేర్చుకోవడమా?

ఇదీ ప్రశ్న ఇది చాలా సున్నితమైనది. విషయం కూడా సూక్ష్మవిచారణ చస్తే గాని బోధపడందీ.

అసలు భాషాప్రచారం అంటేనే పాండిత్యంతో సంబంధించిన పని. హిందీప్రచారం చెయ్యడానికి తెనుగువాడు హిందీపాండిత్యం సంపాదించాలంటే మొదట తన తెనుగులో పండితుడైతే గాని అతను హిందీ నేర్చుకోవడం జాతీయతకి విరుద్ధం. అదీకాక. తనమాతృభాషలో పాండిత్యం కుదిరితే గాని తెనుగువాడు హిందీలో పాండిత్యం సంపాదించడమూ, ఆహిందీని తెనుగువారికి నేర్పడమూ కొనసాగవు. ఇలాగ రెండు భాషలలోనూ ప్రవీణుడైతే గాని అతనికి హిందీప్రచారకత్వయోగ్యత సిద్ధించదు

అయితే బాపినీడుగా రంత దూరం ఆలోచించలేదు. నిజానికి వారు ఆంధ్రభాషలో పండితులు కారు. హిందీలోనేనా పండితు లని వారికి పేరు లేదు, వారు హిందీప్రచారకవిద్యార్థులికి హితోపదేశం చేశారు.

చేసిన ఉపదేశం యిలా వుంది.

కాశీశ్వర్రావుపంతులు గారుకూడా, ప్రారంభోత్సవం నిర్వహిస్తూ జాతీయవిద్యని గురించి చాలా దూరం మాట్లాడారు, కాని వారు కూడా జాతీయతకి సరియైన నిర్వచనం గ్రహించినట్లు లేదు. వారు "మన జాతీయవిద్యకి హిందీ ముఖ్యాంగం అన్నారు. ఇది చాలా తప్పు సిద్ధాంతం. హిందీ మనకి సామాన్యభాష మాత్రమే. విద్య వేరూ భాష వేరూనూ. జాతీయవిద్య మనకీ, అరవలకీ కన్నడులకీ, మహారాష్ట్రులకీ, బంగాళీలకీ, హిందూస్థానీలకీ—అందరికీ వొకటే అయితే యే ప్రాంతంవారి కా ప్రాంతీయభాషలో అది నేర్పబడుతుంది. అలా నేర్పబడితేనే అది జాతీయవిద్య అవుతుంది.

సంగతి యిలా వుండగా మనవారిలో కొందరు హిందీ మనకి జాతీయభాష అని చెబుతున్నారు. జాతీయభాషకీ, సామాన్యభాషకీ వుండే అంతరం వారు గ్రహించలేదు. హిందీ అందరూ నేర్చుకు తీరా లనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టించడానికే వారిలా చెబుతున్నారు గాని వేరు కాదు. దక్షిణభారత దేశీయులకు చివరికి హిందీనే మాతృభాషగా చేసే ఉద్యమానికిది ప్రాతిపదిక. నిజంగా వీరు ఏప్రాంతంవా రాప్రాంతీయభాషలో—తెనుగువారు తెనుగులోనే చదువుకోవా లని, అప్పుడే విద్యార్థులు సులభంగా విజ్ఞానాన్ని సంపాదించుకో గలుగుతా రని గ్రహించలేక పోయేయెడల జాతీయవిద్యని గురించి వీరు మాట్లాడగూడదు. మన యునివర్సిటీలలో ఇంగ్లీషు ప్రధానభాషగా వున్నందుకు మన మందరమూ ఆక్షేపిస్తున్నాము. మన జాతీయవిద్యకి హిందీని ముఖ్యభాషగా అంగీకరించేయెడల యిక యింగ్లీషుని బహిష్కరించడం యెందుకూ?

మొత్తానికి తెనుగుదేశంలో జరుగుతూ వున్న హిందీప్రచారం గోముఖవ్యాఘ్రంగానే వుంది.

(రివ్యూకోసం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు పంపాలి. వొకటి పత్రికాభాండాగారానికీ, వొకటి రివ్యూ చేసేవారికిన్ని. అలా పంపేవారి పుస్తకాలమీదే రివ్యూ త్వరగా ప్రకటన అవుతుంది. వొక్కొక్క ప్రతే వచ్చే పుస్తకాల మీద రివ్యూ ఆలస్యం అవుతుంది. అంతే. రివ్యూను గ్రంథాన్ని బట్టి తద్జ్ఞులచేతనే రాయిస్తాము. వున్న మున్నట్టు రాసేవారిచేతనే రాయిస్తాము. కనక పుస్తకాలు పంపేవారు ఆరివ్యూలతోనే సంతృప్తి పడాలి. వాటిమీద పునర్విమర్శనలకు మా పత్రికలో తావియ్యలేము.)

౧౮ నేనూ, మాకాంతం

'కాంతంకథల'తో మునిమాణిక్యం నరసింహారావు గారు తెనుగు కథకుల్లో ఒక స్థానం సంపాదించారు. 'నేనూ, మాకాంతం' ఆస్థానాన్నే బలపరిచింది. ఇందులో సామాన్య సాంసారిక విషయాలు కొన్ని తీసికొని చిత్రించారు. 'సీతమొగుడు' 'సిలికొండలూ' తప్పిస్తే తక్కిన వాటిలో చక్కని గోరు వెచ్చని హాస్యం పోషింపబడింది. 'సిలికొండల'లో కమల పరివర్తనానికి కారణం ఏమీ నిరూపించబడలేదు. ఆమెమార్పుకు కథకునివలెనే మనం కూడా "అది చిత్రమైన దైవసంఘటన" అని అనవలసి వస్తున్నది. కాంతంపాత్ర మొదటినుండీ చివరవరకు ఒక విధంగానే పోషింపబడింది. కాంతం అమాయకమైన ఇల్లాలు. ఆమె సాంసారిక హృదయం చాలాచోట్ల సున్యంక్తగా చిత్రించి చూపారు మునిమాణిక్యంగారు. అయితే ఈపుస్తకం కథలసంపుటము అనడంకంటె ఇదంతా ఒక కథాభాగం అనడం సమంజసంగా కనపడుతుంది. తదనుగుణ్యంగా పేరుకూడా సార్థకం గానే ఉంది......మిత్రులు మునిమాణిక్యంగారు కథకులుగా ఇపుడున్న స్థానంలోనే ఉండిపోక ఇంకో మెట్టుకూడా వెళ్లాలంటాను.

—పురిపండా

౧౯ ప్రేమతత్త్వము

బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిలు గారుకవిగాకంటెపండితుడుగా ఎక్కువపరిచితులు. ఆంధ్రదేశానికి.

వీరు ఈపుస్తకపు పీఠికలో "నాజీతములో సంఘటిల్లిన యాకస్మిక విపరిణామమునఁ దన్మయమై తదేకాగ్రమైన నాచిత్తవృత్తియే ఈగ్రంథముగాఁ బరిణమించినది" అని వ్రాయుటచేత ఇది యొక శాస్త్రగ్రంథముగా పరిణమించినది.

ప్రేమతత్త్వమును నిర్వచించుటకు కొండను తవ్వినారు. ఎలుక దొరకలేదు.

ప్రేమ అంటే వీరి దృష్టిలో మన కందరికి రూపాయిలమీద సినిమాల మీద పుస్తకాల మీద కుర్చీలమీద ఉండే మమకారమువంటిదిలాగ కనిపిస్తుంది. ప్రేమకు పర్యాయపదములుగ కూరిమి, వాంఛ, తమకము, ఇచ్ఛ, అని శాస్త్రిలుగారు, వాడినారు.

"కామ స్సంకల్పో, విచికిత్సా, శ్రద్ధాఽశ్రద్ధాధృతి, రధృతి, ర్హ్రీ, ర్ధీ, ర్భీ రిత్యేవంసర్వంమనః" ప్రేమకు ఈమనస్సు ఆశ్రయమట. ఈప్రేమవలన నవసరములు పుట్టునట. ఈఅనుగమము అప్రసిద్ధము. ప్రేమను స్థాయిగానుంచి రసములను సాధింపచూచినారు. కాని బీభత్సమునందును, భయానకమునందును, అద్భుతము నందును, ముఖ్యముగా నీయనుగమము కుదరదు. మొత్తముపై ఇందలి ప్రేమతత్త్వనిర్వచనం దధిమహిషీన్యాయగా ఉంది

ఇందులో ప్రాబంధికపు టనుగమము సిద్ధింపచేయాలని చాలా ఉబలాటపడ్డారు. అటులవర్ణన ఆంధ్ర సంస్కృత కవులస్తుతి, మొదలయినవి ఈ పుస్తక విన్యాసానికి ఆరోవేలు. యతిప్రాసలకు పొల్లుపదాలు వాడడం సీసపద్యాలలో పొడుగు సమాసాలు కట్టటం ప్రాచీన వాసనకు లక్ష్యములు. ఏమైన శాస్త్రిగారు శ్రమించి వ్రాసిన ఈపుస్తకం ఏవిచక్షణుణ్ణి కదిపినా కృతార్థమే అవుతుంది.

హనుమదింద్రకంటి